
ఈనాడు
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ
శుక్రవారం అక్టోబరు 25, 2024

తేలియాడుతూ తినేద్దాం..

27న గోదావరిపై ఫ్లోటింగ్ రెస్టారెంట్ ప్రారంభం



రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆహ్లాదకర వాతావరణంలో గోదారి అందాల నడుమ రుచుల విందు ఆస్వాదించేలా ఫ్లోటింగ్ రెస్టారెంట్ సిద్ధమవుతోంది. పర్యాటకశాఖ సౌజన్యంతో ప్రైవేటు వ్యక్తుల నిర్వహణలో గోదావరిపై తొలిసారిగా పూర్తిస్థాయిలో ఇది అందుబాటులోకి రానుంది. రాజమహేంద్రవరంలోని ఉమా మార్కండేయస్వామి ఆలయం సమీపంలోని లాంచీల రేవు నుంచి ఏపీ టూరిజం బోట్‌ల ద్వారా ప్రయాణించి ఫ్లోటింగ్ రెస్టారెంట్‌కు చేరుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 27న ఆదివారం ఉదయం 10.30 గంటలకు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ దీనిని ప్రారంభిస్తారని, ఎంపీ పురందేశ్వరి తదితరులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కిట్టీ పార్టీలు, పుట్టినరోజు వేడుకలు నిర్వహించుకునేందుకు సైతం అనువుగా ఈ రెస్టారెంట్ ఉంటుందన్నారు.

రహదారి, రైల్వే లైన్లపై ప్రత్యేక దృష్టి

అమలాపురం కలెక్టరేట్: జాతీయ రహదారి 216, కోటిపల్లి- నరసాపురం రైల్వే నిర్మాణ పనుల్లో ఎదురయ్యే సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. నిర్వాసితుల సమస్యలపై సానుకూలంగా స్పందించాలని సూచించారు. జేసీ నిశాంతి, అమలాపురం ఆర్డీవో కె.మాధవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నారసింహం.. నయన మనోహరం



అలరించిన కేరళ మోహినియాట్టం నృత్యం



వటివేల్లె కిరీటాలతో ఉత్సవ మూర్తుల దర్శనం

వాడపల్లి(ఆత్రేయపురం): వాడపల్లి శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సింహవాహనంపై స్వామి వైభవంగా ఊరేగారు. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి యోగనరసింహ అలంకరణలో తిరువీధుల్లో విహరించడంతో భక్తులు జయజయ ధ్వానాలు చేశారు. సింహం పరాక్రమానికి, ధైర్యానికి, తేజస్సుకు, ఆధిపత్యానికి, మహా ధ్వనికి సంకేతం. అజ్ఞానంతో ప్రవర్తించే దుష్టులను హరించడంలో తాను సింహ సమానంతో ప్రయత్నిస్తానన్న శ్రీవారి సందేశాన్ని ఈ సందర్భంగా పండితులు వినిపించారు. మహా స్నపన, ప్రధాన హోమాలు, తిరుప్పావడ సేవ, మహాశాంతి హోమం తదితర కార్యక్రమాలను పండితులు రాజేశ్వర వరప్రసాదాచార్యులు నేతృత్వంలో అర్చకస్వాములు జరిపించారు. స్వామివారికి డీసీ ఎన్‌ఎస్ చక్రధరరావు, కనక దుర్గాదేవి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు.

శుక్రవారం మహాలక్ష్మీహోమం, మలయప్ప అలంకరణలో గరుడు వాహన సేవ ఉంటాయి.



సింహవాహన సేవ

యంత్రాలతో తంత్రం

కాటన్ ఆనకట్ట వద్ద యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు



నీటి మళ్లింపునకు నదిలో తవ్విన కాలువలు

ఈనాడు, అమలాపురం; న్యూస్‌టుడే, ఆత్రేయపురం: జాతీయ హరిత ట్రైబ్యునల్ ఆదేశాల మేరకు నదిలో యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేయకూడదు.. రివర్ కన్జర్వేటర్ చట్ట ప్రకారం నదిలో కట్టడానికి 500 మీటర్లకు దూరంలో తవ్వకాలు నిషేధం.. ఈ నిబంధనలు ఎక్కడా అమలుకావడంలేదు. ధవళేశ్వరం కాటన్ ఆనకట్టకు ఆనుకుని ఆత్రేయపురం మండలం బొబ్బర్లంకలో గురువారం వేకువ జాము నుంచి ఉదయం 8.30 గంటల వరకు జేసీబీతో ఇసుక తవ్వకాలు చేపట్టారు. పైగా నీటి మళ్లింపు పనులు చేపట్టారు. కొందరు వ్యక్తులు నదిలో టెంట్ వేసుకుని ఈ తవ్వకాలను పర్యవేక్షించారు. ఇసుక తవ్వి తరలించేందుకు వీలుగానే నీటి మళ్లింపు ప్రక్రియ చేపట్టినట్లు తెలుస్తోంది. బ్యారేజీ స్కవర్ స్లూయిజ్ తదితర చోట్ల రేయింబవళ్లు తవ్వకాలు సాగుతున్నాయి. రోజుకు 30 లారీల వరకు ఇసుక సరిహద్దులు దాటిపోతోంది.



కాటన్ బ్యారేజీకి అతి సమీపంలో జేసీబీతో తవ్వకాలు

రాత్రి 10 తర్వాత ప్రారంభించి..

రాజవరం, వెలిచేరు తదితర చోట్ల లంక మట్టి తవ్వకాలు రాత్రి 10 గంటల తర్వాత ప్రారంభించి వేకువ జామున 4 వరకు కొనసాగిస్తున్నారు. భారీ వాహనాలు ఆనకట్టపైకి వెళ్లకూడదన్న నిబంధన ఉన్నా పట్టడం లేదు. గస్తీ బృందం, లస్కర్లు ఉన్నా అడ్డగోలు తవ్వకాలను నియంత్రించలేదు. బ్యారేజీ వద్ద జేసీబీతో నీటి మళ్లింపు పనులు చేయడంపై హెడ్ వర్క్స్ ఈఈ కాశీవిశ్వేశ్వరరావు వద్ద ప్రస్తావించగా తమ దృష్టికి విషయం వచ్చిందని, టాస్క్‌ఫోర్స్ అధికారులు అడ్డుకున్నట్లు కింది స్థాయి సిబ్బంది తెలిపారన్నారు. కేసు నమోదు చేయాలని ఆదేశించామన్నారు.

విమానాశ్రయం ఇక్కడా? అక్కడా?

ఈనాడు, కాకినాడ -న్యూస్‌టుడే, తొండంగి, తుని పట్టణం

- తొండంగి మండలంలో 519 ఎకరాల భూమి లభ్యతపై ప్రతిపాదన
- కాకినాడ- అమలాపురం మధ్యలో ఏర్పాటు మేలన్న వాదన..
- రెండు జిల్లాలను ఊరిస్తున్న ప్రాజెక్టు

కాకినాడ, కోనసీమ జిల్లాల్లో ఎక్కడా విమానాశ్రయం లేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యాంశం కింద తీసుకుంది. అయితే ఎక్కడ ఏర్పాటనే అంశంపై తర్జనభర్జన సాగుతోంది. ఇప్పటికే తుని-అన్నవరం మధ్యలో భూముల లభ్యతపై ప్రతిపాదనలు వెళ్లడంతో ఇక్కడే ఖరారవ్వచ్చనే చర్చ ఉంది. దీనిని యంత్రాంగం ఇంకా ధ్రువీకరించలేదు. ప్రజల రాకపోకల సౌలభ్యం, భూములు.. పారిశ్రామిక- వ్యాపార- వాణిజ్య- పర్యాటక ప్రాంతాలు బేరీజు వేసుకుని నిర్ణయం తీసుకోనున్నారు.

ఎక్కడెక్కడ సౌలభ్యమంటే..

- కాకినాడ- అమలాపురం మధ్యలో విమానాశ్రయం వస్తే రాజమహేంద్రవరం వెళ్లాల్సిన అవసరం ఉండదు.
- అమలాపురం నుంచి తునిలోని విమానాశ్రయానికి వెళ్లాలంటే 123 కి.మీ.. కాకినాడ నుంచైతే 60 కి.మీ ఉంది.
- తాళ్లరేవు, కరప అనువైన ప్రాంతాలని, రెండు జిల్లాలవారికీ దూరాభారం ఉండదనే వాదన ఉంది.

ప్రణాళికలతో సరి..

ఉమ్మడి జిల్లాలో నగరాలు, పట్టణాలను రానున్న 30 ఏళ్లలో ఎలా అభివృద్ధి చేయాలన్న ప్రణాళికతో గతంలో గోదావరి నగరాభివృద్ధి సంస్థ 'దృక్పథ ప్రణాళిక' గుడా విజన్-2050లో భాగంగా ప్రతిపాదనలు రూపొందించింది. కాకినాడలో విమానాశ్రయం, మెట్రో రైలు ప్రాజెక్టు ఏర్పాటు ఆవశ్యకతను ప్రస్తావించింది. వైకాపా ప్రభుత్వం వచ్చాక ఒక జిల్లా-ఒక విమానాశ్రయం నినాదంతో హడావుడే తప్ప ప్రయత్నాలు సాగలేదు.

కసరత్తు షురూ..

ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సూచనలతో 3సీ, 4సీ, 4ఈ టైప్ ఎయిర్ క్రాఫ్టులు నిలిపేందుకు వీలుగా.. ఎయిర్ సైడ్, సిటీ సైడ్, రన్‌వే స్ట్రిప్‌ను భవిష్యత్తులో విస్తరించేందుకు ఎంత భూమి అవసరమో నిర్దేశించారు. తుని నియోజకవర్గం తొండంగి మండలం బెండపూడి, చిన్నయ్యపాలెం పరిధిలో విమానాశ్రయానికి 519 ఎకరాలు అందుబాటులో ఉన్నట్లు గుర్తించారు. 1,222 మంది రైతుల నుంచి సేకరించాలి. అన్నవరం దేవస్థానం, సెజ్ పరిధిలోని భూమి కావడంతో ఎకరం రూ.70 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉంది. భూసేకరణకే రూ.500 కోట్లు అవసరం.

రెండింటీ ప్రాధాన్యాన్ని గుర్తించి..

కూటమి ప్రభుత్వం వచ్చాక.. తొలి ప్రాధాన్యంగా కాకినాడ- అమలాపురం మధ్య విమానాశ్రయం నిర్మించాలన్న ప్రతిపాదన వచ్చింది. కాకినాడలో ఇప్పటికే రెండు పోర్టులు ఉన్నాయి. పారిశ్రామికంగా కాకినాడ..కొబ్బరి, ఇతర ఆహార ఉత్పత్తుల కేంద్రంగా కోనసీమ ఉండటంతో ఈ జిల్లాలకు మధ్యలో విమానాశ్రయం మేలన్న వాదన ఉంది. ఉప్పు భూములు, పోర్టు భూములు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు తొలగిస్తే ప్రాజెక్టు సాకారమయ్యే అవకాశం ఉంది.



తొండంగి: బెండపూడి-చిన్నయ్యపాలెం మధ్య గుర్తించిన భూములు

బెండపూడి-చిన్నయ్యపాలెంలో విమానాశ్రయం వస్తే దూరం (కి.మీ.లలో)		
తుని పట్టణానికి.. 20	రాజమహేంద్రవరం.. 80	
కాకినాడ.. 60	కాకినాడ సెజ్‌కు.. 20	విశాఖకు 112

డీపీటీ టీకాలు లేవండి!

రాజమహేంద్రవరం వైద్యం: చిన్నారులకు ఏడాదిన్నర వయసులో ఒకసారి, అయిదేళ్లకు మరోసారి వేయాల్సిన డిఫ్తీరియా పెర్టుసిస్ టెటానస్(డీపీటీ) టీకాల ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కొరత ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వం నుంచి సరఫరా లేకపోవడమే కారణమని అధికారులు చెబుతున్నారు. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పీహెచ్‌సీ యూనిట్లలో జరిగే టీకా కార్యక్రమంపై తీవ్ర ప్రభావం కొరత ఏర్పడింది. చిన్నారి వయసు 16-24 నెలల మధ్య డీపీటీ మొదటి బూస్టర్, 5-6 ఏళ్ల మధ్య రెండో బూస్టర్ టీకా వేస్తారు. తూర్పు, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో నెలకు 30 వేల డీపీటీ డోసులు అవసరమవుతాయి. చాలాచోట్ల రెండు నెలలుగా కొరత ఉంది. దీంతో చిన్నారులతో వచ్చే తల్లులు వెనక్కి వెళ్తున్నారు. నెల క్రితం వరకు పాతవాటినే సరిపెట్టారు. టీకాల వినియోగంపై 'ఇ-విన్' పోర్టల్‌లో సక్రమంగా నమోదుచేయకపోవడం సమస్యగా మారింది. మరో రెండు, మూడు రోజుల్లో వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

నడి సంద్రంలో.. దిక్సూచి

మత్స్యకారులకు ఉచితంగా ట్రాన్స్‌పాండర్ల అందజేత

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

జిల్లా వివరాలు..	తీర ప్రాంత మండలాలు	మత్స్యకార గ్రామాలు	వేటపై ఆధారపడిన కుటుంబాలు	మొత్తం బోట్లు
	09	40	25 వేలు	1,930

సముద్రపు అలలకు ఎదురొడ్డి, తుపాన్లు వంటి ప్రకృతి విపత్తులకు ఎదురీది మత్స్యకారులు కడలిలో వేట సాగిస్తారు. కొన్ని సమయాల్లో ప్రకృతి విపత్తులు, తుపాన్ల వల్ల దారి తెలియక ఇతర దేశాల సముద్ర జలాల్లోకి ప్రవేశించి అక్కడి జైళ్లలో మగ్గుతున్నారు. ఇకపై వీరికి ఈ తిప్పలు తప్పనున్నాయి.

సమాచారం తెలిపేలా..

మత్స్యకారులకు సముద్ర జలాల్లో దిక్సూచిగా పనిచేసే పరికరమే ట్రాన్స్‌పాండర్. దీనిని గతంలో సముద్రంలో వేట సాగించే మత్స్యకారులకు 40 శాతం రాయితీపై అందించేవారు. గత అయిదేళ్ల వైకాపా పాలనలో వీటి ఊసే లేకుండా పోయింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన(పీఎంఎస్‌వై) పథకం కింద ఉచితంగా అందిస్తోంది. ఇందులో రెండు పరికరాలు ఉంటాయి. ఒక దాని బోటుకు, మరో భాగాన్ని డ్రైవర్ వద్ద ఏర్పాటు చేస్తారు. ఇది బ్యాటరీ సాయంతో పనిచేస్తుంది.



మత్స్యకార బోట్లకు అమర్చే ట్రాన్స్‌పాండర్ పరికరం

ఇదీ ప్రయోజనం

- తుపాన్లు, వాయుగుండం ఏర్పడినపుడు వాటి సమాచారం ముందస్తుగా తెలియజేస్తుంది.
- పొరుగు దేశాల సరిహద్దులోకి వెళ్తుంటే సంకేతాలు వస్తాయి.
- అనుకోని ప్రమాదం ఎదురైతే డ్రైవర్ వద్ద అమర్చిన పరికరంపై ఎస్‌ఓఎస్ మీట నొక్కగానే సమీపంలోని కోస్టుగార్డు కార్యాలయానికి సమాచారం చేరుతుంది. వారు స్పందించి సహాయం అందించే అవకాశం కలుగుతుంది.
- సముద్రంలో ప్రమాదం జరిగితే శాటిలైట్ ద్వారా కోస్టుగార్డు, మత్స్యశాఖ కార్యాలయం, బోటు యజమానికి సమాచారం వెళ్తుంది.

జిల్లాలో ఇలా..

జిల్లాలో 93 కి.మీ. మేర తీరం ఉంది. జిల్లా వ్యాప్తంగా 7 బోట్ ల్యాండింగ్ సెంటర్లు ఉన్నాయి. వీటి ద్వారా వందల బోట్లు సముద్రంలోకి వేటకు వెళ్తున్నాయి. వీటిలో సోనాబోట్లు(మెకనైజ్డ్) 62 ఉన్నాయి. మిగిలినవి మోటారు బోట్లు. మెకనైజ్డ్ బోట్లపై వేటకు వెళ్లే వారు సుమారు 10 రోజుల వరకు సముద్రంలోనే ఉండి వేట సాగిస్తారు.



పరికరం ఏర్పాటు చేసిన బోటు వద్ద సిబ్బంది

61 బోట్లకు అమర్చాం

జిల్లాకు మొదటి విడతలో 62 పరికరాలు మంజూరయ్యాయి. వీటిని బోట్లకు అమర్చే ప్రక్రియ పూర్తి చేశాం. రెండో విడతలో సుమారు 1850 పరికరాలు అవసరమని అధికారులు తెలిపాం. అవీ త్వరలోనే అందనున్నాయి. వాటిని సముద్రంలో వేటకు వెళ్లే అన్ని బోట్లకు అమరుస్తాం. దీనివల్ల తుపాన్ల సమయంలో మత్స్యకారులు ఆచూకీ సులభంగా తెలుస్తుంది.

-శ్రీనివాసరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి

డీఆర్వోగా సరళవందనం నియామకం

అమలాపురం కలెక్టరేట్: డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఆర్వోగా సత్తెనపల్లి సరళవందనం నియమితులయ్యారు. ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టులో స్పెషల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ డీఆర్వోగా విధులు నిర్వహించిన వెంకటేశ్వర్లు పశ్చిమగోదావరి జిల్లా డీఆర్వోగా బదిలీ అయ్యారు.

జిల్లా విద్యాశాఖాధికారిగా సలీంబాషా

ముమ్మిడివరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారి(డీఈవో)గా షేక్ సలీంబాషాను(ఎఫ్‌ఏసీ) నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం గుంటూరు జిల్లా బోయపాలెం డైట్ ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న ఆయనను కృష్ణా జిల్లా అంగలూరు డైట్ ప్రిన్సిపల్‌గా నియమిస్తూ ఇక్కడికి బదిలీ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇప్పటి వరకు జిల్లా విద్యాశాఖాధికారిగా(ఎఫ్‌ఏసీ) పనిచేసిన ఎం.కమలకుమారి దూబచర్ల డైట్ ప్రిన్సిపల్‌గా పూర్వ విధులకు వెళ్లనున్నారు.

కౌలు రైతులకు రుణ సదుపాయం కల్పించాలి

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా సీసీఆర్ కార్డులు ఉన్న కౌలు రైతులకు పంట రుణాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని జేసీ నిశాంతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వ్యవసాయ రుణాలు, ఇన్సూరెన్సు, పంట రుణాల లక్ష్యంపై సమీక్ష నిర్వహించారు. వాలంటరీ బీమా వర్తింపుతో పాటు, రుణాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వ్యవసాయంలో డ్రోన్ సేవలను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు, ఉద్యాన అధికారి బీవీ రమణ, సీపీవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. గురువారం అమరావతి నుంచి రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల ప్రత్యేక కమిషనర్ బి.రాజశేఖర్ దూరదృశ్య సమావేశం నిర్వహించి పలు అంశాలపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఓఎన్జీసీ ఆస్తుల పరిరక్షణపై సమీక్ష

రాజోలు, న్యూస్‌టుడే: తాటిపాక సోమిశెట్టి ల్యాండ్‌మార్క్‌లో గురువారం ఓఎన్జీసీ రెండవ సెక్యూరిటీ సమన్వయం సమావేశం నిర్వహించారు. ఓఎన్జీసీకి సంబంధించిన కార్యకలాపాలు, సంస్థకు వ్యతిరేకంగా చేసే ఆందోళనలు, విలువైన వస్తువుల దొంగతనాల గురించి చర్చించారు. గ్రామాల్లో చేపట్టే ప్రజాసంక్షేమ కార్యక్రమాల గురించి అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ బి.కృష్ణారావు, ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శాంతానుదాస్, సెక్యూరిటీ ఇన్‌ఛార్జి కుల్దీప్‌సింగ్, అడిషనల్ ఎస్పీ ప్రసాద్, అమలాపురం, కొత్తపేట, రామచంద్రాపురం డీఎస్పీలు టీఎస్ఆర్‌కే ప్రసాద్, గోవిందరావు, రామకృష్ణ, ఓఎన్జీసీ జీజీఎంలు జయంత్‌కుమార్, జి.శ్రీనివాస్, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శాంతానుదాస్

బాలికపై అత్యాచారం కేసులో.. యువకుడికి కఠిన కారాగార శిక్ష

యానాం, న్యూస్‌టుడే: 2021లో అయిదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన 26 ఏళ్ల యువకుడి పుదుచ్చేరి పోస్ట్ ట్రాక్ కోర్టు జడ్జి ఎం.డి.సుమతి గురువారం జైలు శిక్ష విధించారు. మూడు సెక్షన్లలో వరుసగా 20 ఏళ్లు, మూడేళ్లు, ఏడాది కలిపి 24 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.12వేలు జరిమానా విధించారు. బాధిత బాలికకు రూ.4 లక్షలు పరిహారం చెల్లించాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

లెక్క తేలనుంది

జిల్లాలో పశుగణన ప్రారంభం

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

జిల్లాలో పశు గణనకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పశుసంవర్ధక శాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పశువులు, కోళ్లు, గొర్రెలు, పందులు, పెరటి కోళ్లు, మేకలు, ఇతర పెంపుడు జంతువుల వివరాలు సేకరిస్తారు. 2019లో 20వ గణన నిర్వహించగా, ఈ నెల 25 నుంచి 21వ గణన చేపడుతున్నారు. సర్వే అనంతరం వాటి సంఖ్యను బట్టి పథకాల్లో నిధుల కేటాయింపు, వాటికి అభివృద్ధికి చర్యలు చేపడతారు.

జిల్లా వ్యాప్తంగా పశు సంపద (2019 ప్రకారం)

గేదెలు	1,53,542
ఆవులు	75,460
గొర్రెలు	25,111
మేకలు	23,518
కోళ్లు	57,31,807
పందులు	6,268

యాప్‌లో నమోదు

పశు గణనకు సంబంధించి గతంలోనే జిల్లా అధికారి కార్యాలయంలో సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. జిల్లాలో 55 మంది పశు వైద్యాధికారులను పర్యవేక్షకులు(సూపర్‌వైజర్లు)గా నియమించారు. 280 మందిని గణకులు(ఎన్యుమేటర్లు)ను నియమించారు.



పశు గణనపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పక్కాగా పరిశీలన

అఖిల భారత పశుగణనను పక్కాగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తాం. ఈ గణన ద్వారా పశుపోషకులకు ప్రభుత్వ పథకాలు చేరువయ్యే అవకాశం ఉంది. -వెంకట్రావు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి

రోడ్డెక్కితే.. పద్మవ్యూహమే

ట్రాఫిక్ నియంత్రణ లేక ప్రజలకు అవస్థలు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం పట్టణంలో ట్రాఫిక్ సమస్యలతో జనం అవస్థలు పడుతున్నారు. అనపర్తి, రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాలకు కూడలిగా ఉంది. పట్టణంలో ప్రధానంగా మార్కెట్ సెంటర్, రాజగోపాల్ సెంటర్లలో ట్రాఫిక్ ఇబ్బందులు పెరుగుతున్నాయి. ఇక్కడ సిగ్నల్ లైట్ల వ్యవస్థ లేదు. కానిస్టేబుల్‌నూ ఏర్పాటు చేయడం లేదు.

192 గ్రామాల నుంచి..

పట్టణానికి చుట్టూ ఉన్న మండలాల్లో సుమారు 192 గ్రామాల ప్రజలు నిత్యం ఏదో ఒక పనిమీద పట్టణానికి వచ్చి వెళ్తూ ఉంటారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాలతోపాటు ఇటీవల 150 పడకల ఆసుపత్రిగా ప్రాంతీయ ప్రభుత్వాసుపత్రి సేవలు మెరుగు పడటంతో ప్రజల రాకపోకల సంఖ్య పెరిగింది. 16 ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలతోపాటు సుమారు 14 ప్రైవేటు విద్యాసంస్థలుండటం ట్రాఫిక్ పెరగడానికి కారణాలు. ప్రతి గంటకు 8 నుంచి 10వేల వాహనాలు రామచంద్రపురం పట్టణ ప్రధాన రోడ్డులో ప్రయాణం చేస్తాయని అధికారిక లెక్కలు. బైపాస్ ఉన్నా భారీ వాహనాలు ప్రధాన రోడ్డుపైకి వస్తున్నాయి.



మార్కెట్ సెంటర్లో వాహనాల రద్దీ


పోలీసు సిబ్బంది ఏరీ..?

ట్రాఫిక్ సమస్యలు తగ్గాలంటే పోలీసు సిబ్బందిని పెంచడంతోపాటు భారీ వాహనాలు కేవలం బైపాస్‌లో వెళ్లేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి. డీఎస్పీ, సీఐ, ఎస్ఐ, ఆర్డీవో, మూడు కోర్టు కార్యాలయాలతోపాటు ఒక మంత్రి, ఎమ్మెల్సీ, ఎంపీలు ఉన్నారు. ఈ కార్యాలయాలకు, మంత్రి కాన్వాయ్‌కు అదనపు సిబ్బంది అవసరం. 45 మందికి 32 మంది మాత్రమే ఉన్నారు. వీరిలోనూ ఏజెన్సీ, ముఖ్యమంత్రి బందోబస్తు, ఆలయాల ఉత్సవాలకు కొంతమందిని పంపిస్తుండటంతో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది.

సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నాం

ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారిస్తున్నాం. రెండు మూడు రోజుల్లో నూతన ఎస్.ఐ వచ్చి బాధ్యతలు స్వీకరిస్తారు. రాజగోపాల్, మార్కెట్ సెంటర్లలో ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను నియమిస్తాం.

- కడియాల అశోక్‌కుమార్, సీఐ, రామచంద్రపురం



కందుకూరి చరితం.. భావితరాలకు పదిలం

వీరేశలింగం జన్మ గృహంలో ఆయన రచనలు

కందుకూరి రచించిన, ఆయనకు సంబంధించిన 60కి పైగా పుస్తకాలు

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

చరిత్ర ఎన్నిసార్లు మననం చేసుకున్నా తెలుసుకోవలసింది ఇంకా మిగిలే ఉంటుంది. కందుకూరి వీరేశలింగం.. నాటి సాంఘిక దురాచారాలపై ఉక్కుపాదం మోపి మహిళల జీవితాల్లో వెలుగు నింపారు. సంఘ సంస్కరణల్లో భాగంగా పలు రచనలూ చేశారు. రాజమహేంద్రవరానికి చెందిన ఎస్‌కేవీటీ కళాశాల తెలుగు శాఖాధిపతి పి.వి.బి.సంజీవరావు కందుకూరి జీవితంపై పరిశోధన చేశారు. అప్పట్లో ఆయన సేకరించిన అరుదైన పుస్తకాలను ఇటీవల రాజమహేంద్రవరంలోని కందుకూరి జన్మగృహం (వంకాయలవారి వీధి)లో అందజేశారు. భావి పరిశోధకులకు అనువుగా వీటిని జన్మగృహంలోని గ్రంథాలయంలో భద్రపరిచారు.



కందుకూరి కేవలం సంఘ సంస్కర్త మాత్రమే కాదు. సమాజ హితం కోసం కలం పట్టిన రచయిత. తొలి నవలా రచయిత కూడా. వాస్తవ పరిస్థితులను ఆధారంగా చేసుకుని ఆయన రాసిన తొలి తెలుగు నవల 'రాజశేఖర చరిత్ర' నేటికీ ప్రత్యేకమే. తొలి తెలుగు విషాదాంత నాటకం ప్రహ్లాద నాటకం. సమాజంలోని నాటి పరిస్థితులను తూర్పారబెడుతూ కందుకూరి రాసిన అనేక రచనలు పుస్తకాల రూపంలో ఉన్నాయి. బాలలకు సంబంధించిన కథా సాహిత్యం, స్త్రీలకు సంబంధించిన పలు పుస్తకాలు రచించారు.




వంకాయలవారి వీధిలో పుట్టిన ఇల్లు

ఇంట్లో ఇప్పటికీ...

వీరేశలింగం 1881 డిసెంబరు 11న తొలి వితంతు పునర్వివాహం జరిపించిన నాటి ఘట్టాన్ని విగ్రహ రూపంలో కందుకూరి గృహంలో ఏర్పాటు చేశారు. సమాజ చైతన్యం కోసం ఆయన నడిపిన వివేకవర్ధిని పత్రిక, రాసిన నాటకాలు ముద్రించేందుకు వినియోగించిన యంత్రం ఇప్పటికీ భద్రమే. కందుకూరి వినియోగించిన దుస్తులు, రాతప్రతులు, ఆయన కూర్చున్న చెక్క కుర్చీ వంటివి ఇక్కడ చూడవచ్చు. కందుకూరి జీవితంలో ముఖ్యమైన అంశాలను పట్టికల రూపంలో నిక్షిప్తం చేశారు. తన భార్య రాజ్యలక్ష్మి కోసం నిర్మించిన భవనం, ఆవరణలో నుయ్యి, పనస చెట్టు వంటి నాటి గుర్తులు నేటికీ పదిలమే.


వినియోగించిన ముద్రణ యంత్రం


పొందుపరిచిన చరిత్ర వివరాలు

పరిశోధన కోసం అయిదేళ్లు తిరిగా..



నేను పుట్టింది ఇన్నీస్‌పేటలో కావడంతో అదే ప్రాంతంలో కందుకూరి స్వయంగా నిర్మించిన వీటీ విద్యాసంస్థలున్నాయి. చిన్నతనం నుంచి అదే ఆవరణలో ఆడుకోవడం, నాన్న ద్వారా కందుకూరి సంస్కరణలు వినడంతో ఆయన చరిత్రపై ఆసక్తి పెరిగింది. పూర్తిస్థాయిలో వీరేశలింగం జీవితం గురించి తెలుసుకోవాలనే తపనతో 1994 మొదలుకుని 1999 వరకు పరిశోధన చేశా. భీమవరం సమీపంలోని కుముదవల్లి గ్రామంలో కందుకూరి స్వయంగా స్థాపించిన గ్రంథాలయంలో ఆయనకు సంబంధించి అనేక వివరాలు తెలిశాయి. ముఖ్యంగా కందుకూరి మద్రాస్‌లోని వేద విలాస్ భవనంలో ఎక్కువగా ఉండేవారు. పరిశోధన సమయంలో నేను సేకరించిన వివరాలతో రూపొందించిన పుస్తకాలు, కొన్ని ఆయన రచించిన పుస్తకాలు కలిపి మొత్తం 60 ఇటీవల పురావస్తుశాఖకు అందజేశా. భావితరాలకు ఆయన చరిత్ర పదిలంగా ఉండాలనేది నా కోరిక.

- పి.వి.బి.సంజీవరావు, కందుకూరి చరిత్ర పరిశోధకుడు, రాజమహేంద్రవరం

పరిశోధకులకు ఉపయుక్తం..



కందుకూరి జన్మగృహంలో వీరేశలింగం రచించిన కొన్ని ముద్రిత పుస్తకాలు భద్రపరిచాం. పరిశోధకులు ఎవరైనా వీటిని అధ్యయనం చేయవచ్చు. ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వంకాయలవారి వీధిలోని కందుకూరి జన్మగృహం సందర్శించవచ్చు.

- కె.తిమ్మరాజు, సహాయ సంచాలకుడు, పురావస్తుశాఖ

ఘనంగా 108 కలశాల పూజ



తూర్పుపాలెంలో మంచిగంటి రామకృష్ణ స్వామి, రాజ్‌కుమార్ స్వాముల ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి 108 కలశాల పూజ గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముందుగా మాలధారులు పవిత్ర జలాలు తీసుకు వచ్చి స్వామిని అభిషేకించి కారుపర్తి కోటేశ్వరరావు సిద్ధాంతి సారధ్యంలో పూజా కార్యక్రమాన్ని జరిపించారు. స్వామియే శరణమయ్యప్ప నామస్మరణతో ఆ ప్రాంతం మారుమోగింది. - న్యూస్‌టుడే, మలికిపురం

కొబ్బరి మొలక.. బాతుపిల్ల పోలిక



కొబ్బరికాయలో గూడు పెట్టుకున్న బాతుపిల్ల బయటకొచ్చి చూస్తుందేమోనని అనుకుంటున్నారా.. మామిడికుదురు మండలం మొగలికుదురులో పూజా సామగ్రి విక్రయించే జీవీ సత్యనారాయణ దుకాణంలోని కొబ్బరికాయ ఇలా విత్తనం ఉండటంతో గురువారం పలువురు దీనిని ఆసక్తిగా గమనించారు. కాయ నుంచి బయటకొచ్చిన మొలక వంపు తిరగడంతో ఇలా ఉందని, వర్షాల వల్ల తేమ ఉండి సహజంగానే ఇలా వచ్చిందని ఉద్యానాధికారి దిలీప్‌కుమార్ తెలిపారు. - న్యూస్‌టుడే, మామిడికుదురు

నారికేళ దళం..



ప్రస్తుతం ఇది, అది అని లేకుండా అన్ని రంగాల్లో మహిళలు సత్తాచాటుతున్నారు. కొబ్బరికి పేరొందిన కోనసీమలో ఒలుపు కార్మికులుగా ఎక్కువ మంది పురుషులే ఉంటారు. శారీరక శ్రమ ఎక్కువగా ఉండటంతో వారే కనిపిస్తారు. పి.గన్నవరం మండలం ముంజవరం గ్రామంలో మేమేం తీసిపోలేదు అన్నట్టు మహిళలు సైతం పనిచేస్తున్నారు. 65 ఏళ్ల వృద్ధురాలు మహాలక్ష్మి ఉత్సాహంగా పనిచేస్తుండటం విశేషం.

- ఈనాడు, అమలాపురం

వృత్తి నైపుణ్యం... ఉపాధికి మార్గం

పీఎం ఇంటర్న్‌షిప్‌కు నేటితో గడువు పూర్తి


అమలాపురంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్, రావులపాలెం పట్టణం

కళాశాలల నుంచి చదువు పూర్తి చేసుకుని బయటకు వస్తున్న విద్యార్థులకు సరైన నైపుణ్యాలు ఉండటం లేదని తరచూ కంపెనీల ప్రతినిధులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఏదో ఒక చదువుతో పాటు యువతకు పూర్తి స్థాయి వృత్తి నైపుణ్యాలు పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం ఇంటర్న్‌షిప్ పథకాన్ని తీసుకొచ్చింది. ప్రముఖ సంస్థల్లో శిక్షణ పొంది నైపుణ్యాలు పెంచుకునేందుకు అవకాశం కల్పిస్తోంది. జిల్లాలోని కళాశాలలు, ఐటీఐ, డిప్లొమా చదివే విద్యార్థులు అర్హులు.

జిల్లాలో విద్యార్థులు	
ఐటీఐ:	7,650
పాలిటెక్నిక్:	4,650
డిగ్రీ:	6,750

● నమోదు ఇలా.. pminternship.mca.gov.in వెబ్‌సైట్లో ఆధార్‌తో అనుసంధానమైన ఫోన్ నంబరు, బయోడేటాతో నమోదు చేసుకోవాలి. ప్రొఫైల్లో తప్పనిసరిగా ఈకేవైసీ పూర్తి చేయాలి. తర్వాత ఇతర నమోదు చేయాలి.

● అర్హతలు: పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసినవారూ అర్హులు. ఈ నెల 25వ తేదీ వరకు నమోదుకు అవకాశం ఇచ్చారు. నవంబరు 15 నుంచి శిక్షణ ప్రారంభం అవుతుంది.

● వీరు అనర్హులు: ఐఐటీ, ఐఐఎం, ఐఐఐటీ, తదితర ఉన్నత విద్యా సంస్థల్లో చదివిన వారు. ఎంబీఏ, సీఏ, ఎంబీబీఎస్, తదితర ఉన్నత డిగ్రీలు పూర్తి చేసినవారు. 2023-24లో కుటుంబంలో ఏ ఒక్కరి ఆదాయమైనా రూ.8 లక్షలు దాటిన వారు, ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నవారు అనర్హులు.

● ఎంపిక ఇలా: దరఖాస్తు చేసుకున్న వారికి ఆబ్జెక్టివ్ పరీక్ష నిర్వహిస్తారు. ఎంపికైన వారు ఎంచుకున్న పరిశ్రమలకు సంబంధించి నైపుణ్య శిక్షణ ఇస్తారు.

● శిక్షణ వీటిలో: సాఫ్ట్‌వేర్, బ్యాంకింగ్, ఆయిల్, గ్యాస్ అండ్ ఎనర్జీ, మైనింగ్, టెలికాం, రిటైల్, సిమెంట్, బిల్డింగ్ మెటీరియల్స్, ఫార్మాస్యూటికల్, ఏవియేషన్, మ్యానుఫాక్చరింగ్, అగ్రికల్చర్, హాస్పిటాలిటీ తదితర రంగాల్లో వృత్తి విద్యకు సంబంధించిన శిక్షణ ఇస్తారు.

● భృతి ఇలా: ఎంపికైన వారికి 12 నెలల పాటు శిక్షణ ఇవ్వడంతో పాటు, వన్‌టైం గ్రాంట్ కింద రూ.6వేలు, ప్రతి నెల ప్రభుత్వం రూ.4,500, కంపెనీ రూ.500 చొప్పున అందిస్తారు. ప్రోత్సాహక నగదు కింద రూ.66వేలు పొందే అవకాశం ఉంది.

నన్నయలో అంతర్ కళాశాలల బాస్కెట్‌బాల్ పోటీలు

నన్నయ విశ్వవిద్యాలయం(రాజానగరం): నన్నయ విశ్వవిద్యాలయంలో అంతర్ కళాశాలల పురుషుల బాస్కెట్‌బాల్ పోటీలు, విశ్వవిద్యాలయ జట్టు ఎంపిక కార్యక్రమానికి గురువారం వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు హాజరయ్యారు. ఉమ్మడి గోదావరి జిల్లాల నుంచి వివిధ కళాశాలల క్రీడాకారులు విచ్చేయగా.. వారికి శుభాకాంక్షలు తెలిపి, బాస్కెట్‌బాల్ గోల్ వేసి పోటీలు ప్రారంభించారు. వీసీ ఆచార్య మాట్లాడుతూ.. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని నన్నయ విశ్వవిద్యాలయం తరఫున 42 రకాల క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. రెండు రోజులు యూనివర్సిటీలో నిర్వహించనున్న ఇంటర్ కాలేజీయేట్ బాస్కెట్‌బాల్ మెన్ టోర్నమెంట్ కమ్ యూనివర్సిటీ టీమ్ సెలక్షన్స్‌కు ఆయా కళాశాలల నుంచి 13 జట్లు, 12 మంది వ్యక్తిగత క్రీడాకారులు హాజరయ్యారన్నారు. నాకౌట్ కమ్ లీగ్ పద్ధతుల ద్వారా పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రతిభావంతుల జట్టు నవంబరు 1నుంచి 5వ తేదీ వరకు బెంగళూరులో క్రిస్ట్ యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొంటారన్నారు. రిజిస్ట్రార్, స్పోర్ట్స్ బోర్డ్ ఇన్‌ఛార్జి కో ఆర్డినేటర్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపల్ డా.కె.సుబ్బారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.మూర్తి, సెలక్షన్ కమిటీ సభ్యులు రైల్వే కోచ్ ప్రసాద్, బాపిరెడ్డి, అబ్జర్వర్ పీఆర్ కళాశాల పీడీ రమణ, విశ్వవిద్యాలయ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగ అధ్యాపకులు, పీడీలు, కోచ్‌లు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న వీసీ శ్రీనివాసరావు


వంద మీటర్ల పరుగులో క్రీడాకారిణులు

అథ్లెటిక్స్.. ఆట అదుర్స్

శ్యామలా సెంటర్ (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపిక గురువారం రాజమహేంద్రవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రారంభమైంది. జిల్లా స్కూల్ గేమ్స్ సంఘం ఆధ్వర్యంలో రెండురోజుల పాటు జరగనున్న ఈ పోటీలకు తొలిరోజు అండర్-14 విభాగంలో ఎంపికలు జరిగాయి. పరుగు, హర్డిల్స్, హైజంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావలిన్‌త్రో తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించి క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి తెలిపారు. ఎంపికైన జట్టు శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. తూర్పు గోదావరి డీఎస్ఈఓ కె.వాసుదేవరావు, డీవైఈఓ నారాయణ, డీఐ బి.దిలీప్‌కుమార్‌లు ఈ పోటీలు ప్రారంభించారు.

యువత భవితకు 'దిక్సూచి'

రాజమహేంద్రవరం సాంస్కృతికం: నిపుణులు చెప్పిన మాటలు ఉజ్వల భవితకు బాటలు వేస్తాయని లయన్స్ క్లబ్ జిల్లా మొదటి ఉపగవర్నర్ వజ్రపు కోటేశ్వరరావు పేర్కొన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ కార్యక్రమంలో భాగంగా లయన్స్ క్లబ్ రాజమండ్రి వజ్రం, లయన్స్ క్లబ్ రాజమండ్రి కడియం హార్టికల్చర్ సహకారంతో నగరంలోని ఆనం కళాకేంద్రంలో రెండురోజుల పాటు నిర్వహించే దిక్సూచి కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస నిపుణులతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆదిత్య కళాశాల డైరెక్టర్ ఎస్.పి.గంగిరెడ్డి మాట్లాడుతూ తెలిసిన అంశాలను వేదికపై ప్రదర్శించేందుకు విద్యార్థులు భయపడకూడదన్నారు. క్లబ్ రీజియన్ ఛైర్‌పర్సన్ ఎం.వాణిశ్రీ, జిల్లా పూర్వపు గవర్నర్ మాటూరి మంగతాయారు, లయన్ వేలూరి సూర్యనారాయణ, లింగమల్లు కృష్ణమూర్తి, బి.వి.ఎన్.రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ లక్ష్మారెడ్డి, అడ్వైజర్ విశ్వేశ్వరరావు తదితరులు మాట్లాడారు. నగరంలోని పలు కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు గంపా నాగేశ్వరరావు, వేణుకల్యాణ్, సినీనటుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు కె.వి.ప్రదీప్, ఐఏఎస్ కోచింగ్ నిపుణురాలు, విద్యావేత్త బాల లత, చార్టెడ్ అకౌంటెంట్ రాహుల్ వేదాంతం తదితరులు యువతకు మార్గనిర్దేశం చేశారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న లయన్స్ ప్రతినిధులు

ప్రభుత్వ ఐటీఐ ఉద్యోగుల జిల్లా కార్యవర్గం ఎన్నిక

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఐటీఐ, డీఎల్‌టీసీల అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవమైంది. కాకినాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో గురువారం ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. అతిథులుగా కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ ఎంవీజీ వర్మ, అసోసియేట్ రాష్ట్ర నాయకురాలు జి.మంగతాయారు, జిల్లా గౌరవాధ్యక్షుడు ఈజే మోహనరావులు హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు ఎంఎన్ఎస్.మూర్తి, ఉపాధ్యక్షులు జి.విజయ్‌కుమార్, ఎం.ముక్తేశ్వరరావు, కార్యదర్శి పీజే.శ్రీనివాసబాబు, కోశాధికారి కె.శ్రీనుకుమార్, సహాయ కార్యదర్శులు ఎస్.సౌజన్య, ఎం.పద్మ, కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కాకినాడ యూనిట్ అధ్యక్షుడిగా వీవీఎల్.నరసింహారావు, కార్యదర్శిగా ఎస్ఏ.శంకరరావు, కోశాధికారిగా జి.శ్రీనివాసరావు తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉద్యోగులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి, ఐటీఐ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.


ఎన్నికైన సభ్యులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ వర్మ తదితరులు

పక్షవాత బాధితురాలిపై అత్యాచారం

పి.గన్నవరంలో అమానుషం

పి.గన్నవరం, న్యూస్‌టుడే: అసలే వృద్ధాప్యం.. ఆపై పక్షవాతం. మంచం పైనుంచి లేవలేని దుస్థితి. ఎవరైనా సాయం ఉంటేగాని సొంత పనులు కూడా చేసుకోలేని దైన్యం. ఇలాంటి దయనీయ స్థితిలో జీవితం వెళ్లబుచ్చుతున్న ఓ వృద్ధురాలిని కూడా ఆ కామాంధుడు వదల్లేదు. ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ అమానవీయ ఘటన పి.గన్నవరం మండలంలో చోటుచేసుకుంది. బుధవారం అర్ధరాత్రి దాటాక ఒంటిగంట సమయంలో పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఐ.పోలవరం మండలానికి చెందిన 60 ఏళ్ల వృద్ధురాలు పక్షవాతంతో బాధపడుతోంది. ఉదయం నిద్రలేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ఎవరైనా తోడు ఉండాల్సిందే. నాలుగు నెలల క్రితం పి.గన్నవరం మండలంలో ఉంటున్న కుమార్తె వద్దకు వచ్చింది. పూర్తిగా మంచానికే పరిమితమైన తల్లికి అన్ని సపర్యలు ఆమే చేస్తోంది. బుధవారం కుమార్తె గ్రామంలో జరుగుతున్న ఓ శుభకార్యానికి వెళ్లారు. తిరిగి సాయంత్రం ఇంటికొచ్చి చూసేసరికి తల్లిపై అత్యాచారం జరిగినట్లు గుర్తించారు. స్థానికంగా ఉండే లంకే సత్యనారాయణ(50) ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శివకృష్ణ గురువారం విలేకరులకు తెలిపారు. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉన్నాడన్నారు. ఇతను జట్టుకూలిగా పనిచేస్తుంటాడన్నారు.

పాలగుమ్మిలో స్త్రీనిధి సొమ్ము స్వాహా

రూ.9 లక్షలు పక్కదారి పట్టినట్లు ప్రాథమికంగా గుర్తింపు

అమలాపురం గ్రామీణం: అమలాపురం మండలం పాలగుమ్మిలో డ్వాక్రా మహిళలు చెల్లించిన స్త్రీనిధి సొమ్మును ఇద్దరు వీఓఏలు స్వాహా చేసిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన లావణ్య, కనకమహాలక్ష్మి వీఓఏలుగా పనిచేస్తున్నారు. నగదు చెల్లింపులు ఆలస్యం కావడంతో స్త్రీనిధి మేనేజర్ అవినాష్ విచారణ చేపట్టారు. రూ.9 లక్షలు మేర అవకతవకలు జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించారు. అందులో రూ.4 లక్షలు జమ చేయగా.. మిగిలిన సొమ్ము రికవరీ చేయాల్సి ఉంది. డ్వాక్రా మహిళలు చెల్లించిన సుమారు రూ.15 లక్షలకు సంబంధించి విచారణ జరిపితే మరిన్ని అక్రమాలు బయటపడే వీలుందని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ విషయంపై ఏజీఎం ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ పూర్తిస్థాయిలో విచారించాల్సి ఉందని పేర్కొన్నారు.

విద్యార్థిని మృతదేహానికి పరీక్ష

ఆలమూరు: ఈ నెల 18న ఆత్మహత్యకు పాల్పడిన మండలంలోని ఓ గ్రామానికి చెందిన పదోతరగతి విద్యార్థిని(15) మృతదేహాన్ని వెలికితీసి గురువారం తహసీల్దార్ ప్రకాష్‌బాబు, ఆత్రేయపురం ఎస్సై ఎస్.రాము, ఏఎస్ఐ సూర్యచంద్రరావు, విద్యార్థిని కుటుంబ సభ్యుల సమక్షంలో శవపరీక్ష నిర్వహించారు. తన కుమార్తెను పాఠశాల యాజమాన్యం మందలించడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు బాధిత తండ్రి ఈ నెల 22న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శవపరీక్ష నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	11,500
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	16,000
గటగట	13,500
కొత్తకాయ: గండేరా	15,500
గటగట	13,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	12,000-13,500
కొత్త (పచ్చి) కాయ	11,500-12,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో	
ఫారంరేటు	130-00
రిటైల్ లైవ్	152-00
డ్రెస్డ్	220-00
స్కిన్‌లెస్	251-00

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

తాగునీటి సౌకర్యం కల్పించండి: ఆర్డీవో

మలికిపురం, న్యూస్‌టుడే: గూడపల్లి కొప్పిడి వారి మెరక యూపీ పాఠశాలకు తక్షణమే పైపులైను వేసి తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని అమలాపురం ఆర్డీవో కె.మాధవి ఆదేశించారు. ఈ పాఠశాలలో 82 మంది విద్యార్థులు ఉన్నారు. ఆర్వో ప్లాంటు ఉన్నప్పటికీ తరచూ మరమ్మతులకు గురవుతోంది, దాని ద్వారా వచ్చేనీరు సరిపోక సతమతమవుతున్నారు. ఈ క్రమంలో విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని కలెక్టరుకు గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. ఆయన సూచనలతో ఆర్డీవో గురువారం పాఠశాలను సందర్శించి అక్కడి సమస్యను ప్రధానోపాధ్యాయుడు కేవీ హెచ్‌వీ రమణను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో ఎం.బాలాజీ, తహసీల్దారు టి.శ్రీనివాసరావు, ఎంఈవో ఎం.విజయశ్రీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడారు. తక్షణమే పైపులైను వేసి సోమవారానికి కల్లా నీరు అందించాలని ఆదేశాలు జారీచేశారు.

దీపావళికి ముందస్తు జాగ్రత్తలు

కొత్తపేట: దీపావళి బాణసంచా విక్రయదారులు జాగ్రత్తలు పాటించాలని, నిర్దేశించిన ప్రదేశాల్లోనే వ్యాపార కార్యకలాపాలు జరుపుకోవాలని ఆర్డీవో పి.శ్రీకర్ అన్నారు. గురువారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. వ్యాపారుల వద్ద అగ్నిమాపక నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు.

ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా భీమారావు

అయినవిల్లి: ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా భీమారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అంబాజీపేట ఈవోపీఆర్డీగా పనిచేసేవారు. ఈ సందర్భంగా ఆయనకు పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎంపీడీవో వెంకటాచార్య సాధారణ బదిలీల్లో భాగంగా ముమ్మిడివరం బదిలీ అయ్యారు

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు వందనం

చెత్తాచెదారం శుభ్రం..

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెం కాలువ అవతల రోడ్డు చెంతన చెత్తాచెదారం పేరుకుపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 'ఈనాడు మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి ఎల్.దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకుని వెళ్లడంతో సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

కాలువల్లో పూడిక తొలగింపు

రావులపాలెం గ్రామీణం, న్యూస్‌టుడే: రావులపాలెం మండలం గోపాలపురంలోని కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో మురుగునీరు పారడం లేదు. దుర్వాసన రావడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి సాయిరామ్ దృష్టికి తీసుకుని వెళ్లగా ఆయన పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి పూడిక తీయించారు.

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174 పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట:90323 93884

సాగునీటి సంఘాలు.. రైతులకు అండ

గత తెదేపా ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన సాగునీటి సంఘాల ద్వారా రైతులకు సత్వర ప్రయోజనం చేకూరేది. ఈ వ్యవస్థను గత వైకాపా ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దీంతో అయిదేళ్లలో ఎన్నో ఇబ్బందులు పడ్డారు. ప్రధానంగా రబీలో సాగునీటి కొరత వచ్చినప్పుడు సంఘాల ప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించేవారు. ఇలాంటి వ్యవస్థను తిరిగి తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. టీసీ మెంబర్లు, సాగునీటి సంఘాల అధ్యక్షులు, నీటి పంపిణీ, ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్‌లు.. ఇలా వివిధ స్థాయిల్లో ప్రతినిధులు రైతులకు అందుబాటులోకి వస్తారు.

- న్యూస్‌టుడే, పి.గన్నవరం, అంబాజీపేట



పి.గన్నవరం ప్రధాన పంట కాలువలో పడి ఉన్న చెట్టు

పి.గన్నవరం ఇరిగేషన్ సబ్‌డివిజన్ పరిధిలోని ఆత్రేయపురం, రావులపాలెం, కొత్తపేట, అంబాజీపేట, పి.గన్నవరం, మామిడికుదురు, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాలకు సంబంధించి సుమారు 60 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రస్తుత ఎన్నికలతో సబ్‌డివిజన్ పరిధిలో గోపాలపురం, అవిడి, పి.గన్నవరం, రాజోలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఏర్పడతాయి. వీటి పరిధిలో 24 సాగునీటి వినియోగదారుల సంఘాలు ప్రతినిధులు వస్తారు. ఒక్కో సంఘంలో 12 మంది టీసీ మెంబర్లు ఉంటారు. ఈ మొత్తం సంఘాలు గోదావరి డెల్టా సిస్టం ప్రాజెక్టు పరిధిలో ఉంటాయి. ● పి.గన్నవరం డిస్ట్రిబ్యూటర్ కమిటీలో పి.గన్నవరం, మానేపల్లి, తాటిపాక, పొన్నమండ, పొదలాడ, కడలి సాగునీటి వినియోగదారుల సంఘాలు ఉంటాయి. ● గోపాలపురం కమిటీ పరిధిలో గోపాలపురం, ఆత్రేయపురం, రావులపాలెం, వద్దిపర్రు, మెర్లపాలెం, అంకంపాలెం, జి.పెదపూడి ఉంటాయి. ● రాజోలు డిస్ట్రిబ్యూటరీ కమిటీ పరిధిలో రాజోలు, లక్కవరం, రామరాజులంక, మలికిపురం, అంతర్వేది, గొంది, సఖినేటిపల్లి సాగునీటి వినియోగదారుల సంఘాలు వస్తాయి.



ఏడాదికి రూ.40 లక్షల విలువైన పనులు

సాగునీటి వినియోగదారుల సంఘాలు ఉన్నప్పుడు రైతులకు సత్వరమే సేవలు అందించేవాళ్లం. మా సంఘ పరిధిలో ఏడాదికి రూ.40 నుంచి రూ.50 లక్షల విలువైన పనులు చేసేవాళ్లం. కాలువలు, మురుగు కాలువలు బాగు చేయించేవాళ్లం. తుపానులు, వరదలు వచ్చినప్పుడు అత్యవసర మరమ్మతులు చేయించేవాళ్లం. సాగునీటి సంఘాలు లేక ఐదేళ్ల పాటు రైతులు చాలా ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

- ఆరుమిల్లి సాయిబాబు, మానేపల్లి నీటి సంఘం మాజీ అధ్యక్షుడు

శివారు భూములకు నీరు



వైకాపా పాలనలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరపలేదు. దీంతో శివారు భూములకు సాగునీరు అందక ఇబ్బందులు పడ్డాం. కాలువలు, మురుగు కాలువల్లోని వ్యర్థాలు తొలగించకపోవడంతో పంట పొలాలకు సాగునీరు అందలేదు. ఇప్పుడు సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తే రైతులకు లాభం చేకూరుతుంది.

- మాదిరెడ్డి పుల్లయ్య, రైతు, కె.పెదపూడి

తైక్వాండోలో బంగారు పతకం

అంబాజీపేట, న్యూస్‌టుడే: అంబాజీపేట మండలం నందంపూడికి చెందిన అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాల విద్యార్థిని పితాని భార్గవిశ్రీ కళ తైక్వాండో పోటీల్లో బంగారు పతకం కైవసం చేసుకున్నట్లు జిల్లా తైక్వాండో శిక్షకుడు పి.త్రిమూర్తులు గురువారం వెల్లడించారు. ఈ నెల 23న ఈ పోటీలు అన్నవరం డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో జరిగాయన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తరపున పాల్గొన్నట్లు చెప్పారు.

చెరువు భూమి సర్వేకి సహకరించాలి

మలికిపురం, న్యూస్‌టుడే: అడవిపాలెంలోని పంచాయతీ చెరువు భూమి సర్వేకి సహకరించాలని తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎస్సై సురేశ్ విజ్ఞప్తి చేశారు. ఈ చెరువును పూడ్చి గతంలోనే కొంతమంది గృహాలు నిర్మించుకున్నారు. మిగిలిన స్థలాన్ని సర్వేచేసి అందులో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలన్న ఉద్దేశంతో పంచాయతీ తీర్మానం చేసింది. పదిహేను రోజుల క్రితం సర్వే చేయడానికి వెళ్లిన అధికారులను ఒకవర్గం అడ్డుకుంది. ఉన్నతాధికారుల సూచనలతో మళ్లీ గురువారం సర్వే చేయడానికి తహసీల్దారు, ఎస్సై, సర్వేయర్, ఇతర అధికారులు వచ్చారు. చుట్టూ ఇళ్లు నిర్మించుకున్న వారు అభ్యంతరం చెప్పడంతో స్థానికులతో చర్చలు జరిపారు. తహసీల్దారు, ఎస్సైలు మాట్లాడుతూ.. ప్రస్తుతం నిర్మించుకున్న ఇళ్లకు ఏవిధమైన నష్టం ఉండదని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్థులు సర్వేకు అంగీకరించారు. పంచాయతీ కార్యదర్శి డి.సీతారాముడు, సర్వేయరు మధుసూదనరాజు, ఎంపీటీసీ సభ్యుడు ఆచంట మాణిక్యం, ఉపసర్పంచి కె.నరసింహస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

పి.గన్నవరం, న్యూస్‌టుడే: నరేంద్రపురం ఉపకేంద్రం పరిధిలోని నరేంద్రపురం, పప్పులవారిపాలెం, కుందాలపల్లి, జి.పెదపూడి, ఊడిమూడిలంక, రాజులపాలెం, ఇసుకపూడి, బెల్లంపూడి, యర్రంశెట్టివారిపాలెం గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేయనున్నట్లు అమలాపురం విద్యుత్తుశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ లైన్, ఆర్‌డీఎస్‌ఎస్ పనుల నేపథ్యంలో సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు.

కొత్తపేట: బిళ్లకుర్రు సబ్‌స్టేషన్ పరిధిలోని బిళ్లకుర్రు, వానపల్లి గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరుకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ తెలిపారు. పలివెల వంతెన ఏరియా, అవిడి, గంటి, మోడేకుర్రు, గొలకోటివారిపాలెం గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థినుల వేషధారణ



ఐక్యరాజ్య సమితి ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని శివకోటి జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం వరల్డ్ కల్చరల్ ఫుడ్‌ఫెస్ట్ నిర్వహించారు. విద్యార్థులకు ఉపన్యాస పోటీలు ఏర్పాటు చేశారు. విద్యార్థుల వివిధ దేశాలకు చెందిన వస్త్రధారణ ఆకట్టుకుంది. వివిధ దేశాలకు చెందిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. సాంఘికశాస్త్ర ఉపాధ్యాయిని సత్యవాడ సుబ్బలక్ష్మి, మట్టపర్తి నరసింహారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రధానోపాధ్యాయుడు నయినాల శ్రీనివాసరావు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ పి.సాయిబాబు ఆధ్వర్యంలో ఐక్యరాజ్యసమితి ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు.

- న్యూస్‌టుడే, రాజోలు



స్నపనం నిర్వహిస్తున్న అర్చకులు



చిన్నారుల నృత్య ప్రదర్శన



మహిళల డ్రమ్ము వాయిద్యాలు

నారాయణం.. నయనానందం

వాడపల్లి వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం స్వామివారు యోగనరసింహ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సింహవాహనంపై మాడ వీధుల్లో ఊరేగారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన స్నపన తిరుమంజనంలో మలయప్పస్వామి అలంకరణలు ఆకట్టుకున్నాయి. ఏలకులు, వట్టివేరు, వివిధ రకాల ఎండు ఫలాలు, చందనం, రోజ్ పెటల్స్, తులసీ మాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

- న్యూస్‌టుడే, ఆత్రేయపురం



వేంకటేశ్వరుడు

యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ నిధితో చేయూత



అన్నపూర్ణ కుటుంబానికి రూ.3 లక్షల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ ఐవీ

పి.గన్నవరం, సఖినేటిపల్లి: యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ నిధి ద్వారా ఆపద సమయంలో ఆర్థిక చేయూత చేకూరుతుందని ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. పి.గన్నవరం జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినిగా పని చేస్తూ ఇటీవల మృతిచెందిన వై.అన్నపూర్ణ కుటుంబానికి రూ.3 లక్షల చెక్కును గురువారం ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, ఎంఈవోలు కోనా హెలీన, మండల శాఖ అధ్యక్షుడు బి.రామకృష్ణ ప్రధానోపాధ్యాయుడు డి.ఎస్.వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ● ఇటీవల జరిగిన రహదారి ప్రమాదంలో మృత్యువాత పడిన సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని సీహెచ్ సుజాత కుమార్తెలకు యూటీఎఫ్ సంక్షేమ పథకం ద్వారా రూ.3 లక్షల చెక్కును ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వర్లు, ఎంఈవోలు కిశోర్‌కుమార్, వెంకటేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు.



లక్ష్మిని అభినందిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

గ్రామాభివృద్ధికి పాటుపడాలి: ఎమ్మెల్యే

పి.గన్నవరం, న్యూస్‌టుడే: ప్రజాప్రతినిధులు గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. పి.గన్నవరం మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షురాలిగా నరేంద్రపురం ఎంపీటీసీ సభ్యురాలు కొక్కిరి లక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గురువారం ఆమెను ఎమ్మెల్యే, కూటమి నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, నాయకులు నామన రాంబాబు, డొక్కా జగన్నాథం, శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు నోటీసులు

మలికిపురం, న్యూస్‌టుడే: విద్యార్థులు తగ్గిన క్రమంలో కళాశాలలో తగిన పనిలేని 24 మంది అధ్యాపకులను గుర్తించి చట్టపరంగా వారిని ఎందుకు తొలగించకూడదో తెలియచేయాలని ఏఎఫ్‌డీటీ పాలకవర్గం కరస్పాండెంట్ షోకాజ్ నోటీసులు జారీచేశారని స్థానిక ఎమ్మీఎన్, జేఎస్ అండ్ ఆర్వీఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు గురువారం స్థానిక విలేకర్లకు తెలిపారు. జీతాల కోసం గత 43 రోజులుగా అధ్యాపకులు కళాశాల ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టి ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వారందరికీ పాలకవర్గం నోటీసులు జారీచేసింది. ఈ సందర్భంగా అధ్యాపకులు తమ నిరసన వ్యక్తం చేశారు. గెద్దం పేర్రాజు, ఫిలిప్‌రాజు, చెవ్వాకుల సూర్యప్రకాశరావు, నల్లి శివ తదితరులు వీరికి సంఘీభావం పలికి పాలకవర్గం వైఖరిని తప్పుబట్టారు. పాలకవర్గం మాజీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దివంగత అల్లూరి కృష్ణంరాజు తనయుడు శ్రీనివాసరాజు పాలకవర్గం, కరస్పాండెంట్ మంగెన సత్యనారాయణమూర్తి, ఆందోళన చేస్తున్న అధ్యాపకులతో మాట్లాడారు.

వివాహిత అదృశ్యం

అంబాజీపేట, న్యూస్‌టుడే: అంబాజీపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ తన రెండేళ్ల బాబుతో అదృశ్యమైనట్లు భర్త వి.బాలాజీ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 22 రాత్రి నుంచి తన భార్య, కుమారుడు కనిపించడం లేదని ఆయన పోలీసులకు తెలిపారు. 23న ఉదయం ఫోన్‌చేసి తనకోసం వెతకొద్దని చెప్పిందని, అనంతరం ఫోన్ స్విచ్ఛాఫ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ ప్రసాద్ చెప్పారు.

కొబ్బరి గోదాములో తాచుపాము హల్‌చల్

అంబాజీపేట: అంబాజీపేటలోని ఓ కొబ్బరి గోదాములో తాచుపాము గురువారం హల్‌చల్ చేసింది. కొబ్బరికాయల్లో నక్కి బుసలుకొడుతూ అక్కడ పనిచేసే కార్మికులను భయభ్రాంతులకు గురిచేసింది. దీంతో నిర్వాహకులు భీమనపల్లికి చెందిన స్నేక్‌క్యాచర్ జంపన గణేష్‌వర్మకు సమాచారం అందించడంతో ఆయన వచ్చి పామును బంధించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

బంగారు ఆభరణాల బ్యాగ్ మరిచి వెళ్లిపోయిన మహిళ

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెంలో ఓ మహిళ బంగారు వస్తువులతో కూడిన హ్యాండ్‌బ్యాగ్ మరిచిపోయారు. గంట తరువాత వచ్చి చూసేసరికి లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శేఖర్‌బాబు తెలిపిన వివరాలిలా.. పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడుకు చెందిన తాడిగడప సుబ్బలక్ష్మి ఆత్రేయపురంలో ఒక భూమి రిజిస్ట్రేషన్ కోసం రావులపాలెం బస్టాండ్‌కు గురువారం వచ్చారు. అక్కడ బ్యాగ్ మరిచిపోయి ఆటో ఎక్కి ఆత్రేయపురం వెళ్లిపోయారు. తిరిగొచ్చి చూసినా బ్యాగ్ కనిపించలేదు. ఇందులో రెండు కాసుల బంగారు నక్లెస్, కాసు చైను, అరకాసు మాటీలు, 62 తులాల వెండి పట్టీలు, రూ.11 వేలు నగదు ఉన్నట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే విషయంపై ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది.

ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి కృషిచేయాలి: బండారు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు, నాయకులు

కొత్తపేట పి.గన్నవరం, న్యూస్‌టుడే: కూటమి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం గురువారం కొత్తపేట కాపు కల్యాణ మండపంలో శాసనసభ్యుడు బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ కూటమి పట్టభద్రుల అభ్యర్థి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ భూమిరెడ్డి మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికల కోసం ప్రతి కార్యకర్త ఓటు నమోదు చేయించాలన్నారు. కరపత్రాలు ఆవిష్కరించారు. నియోజకవర్గ పరిశీలకుడు వాసిరెడ్డి రాంబాబు, జనసేన ఇంఛార్జి బండారు శ్రీనివాస్, భూసి జయలక్ష్మి పాల్గొన్నారు. ● పట్టభద్రుల శాసన మండలి కూటమి అభ్యర్థిగా ప్రకటించిన పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతు పలకాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కోరారు. పి.గన్నవరంలో జ్ఞరాజశేఖర్ పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్, జిల్లా తెదేపా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, రాష్ట్ర సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మోకా ఆనందసాగర్, నియోజకవర్గ తెదేపా కన్వీనర్ నామన రాంబాబు, కూటమి నాయకులు డొక్కా జగన్నాథం, శిరిగినీడి వెంకటేశ్వరరావు వాసంశెట్టి కుమార్, మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, సంసాని పెద్దిరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేయండి: కొండేటి

రాజోలు, రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు అన్నారు. రాజోలు అంబేడ్కర్ సామాజిక భవనంలో గురువారం ఇన్‌ఛార్జి సరెళ్ల ప్రసన్నకుమార్ అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్యకర్తలంతా కలిసి రానున్న రోజుల్లో పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలన్నారు. త్వరలో జరిగే నీటి, సహకార సంఘాల ఎన్నికల్లో అభ్యర్థులు పోటీ చేస్తారని చెప్పారు. ఈ నెల 26న విజయవాడలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిలతో జరిగే సమావేశానికి అధిక సంఖ్యలో కార్యకర్తలు హాజరవ్వాలన్నారు. పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, పీసీసీ సభ్యులు రుద్రరాజు గోపాలకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు. ● విజయవాడలో ఈ నెల 26న జరిగే కాంగ్రెస్ పార్టీ సమావేశానికి అధిక సంఖ్యలో కార్యకర్తలు హాజరవ్వాలని కొండేటి చిట్టిబాబు అన్నారు. రావులపాలెం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో కొత్తపేట నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి రౌతు ఈశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథులుగా చిట్టిబాబు, ఏపీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్ హాజరయ్యారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ఇటీవల జిల్లాస్థాయిలో నిర్వహించిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో మెర్లపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సి.హెచ్.శ్రీహరి, వ్యాయామోపాధ్యాయుడు ఎస్.శ్రీకాంత్ తెలిపారు. ఆత్రేయపురం మహర్షి ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు కూడా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల డైరెక్టర్ ఎన్వీ రామరాజు తెలిపారు. గురువారం ఆయా విద్యార్థులను అభినందించారు.



ఉపాధ్యాయులతో మెర్లపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు



నూతనంగా ఎన్నికైన జేఏసీ ప్రతినిధులు

'మహిళలపై వివక్ష తగ్గలేదు'

రామచంద్రపురం, న్యూస్‌టుడే: మహిళలు ప్రతి విభాగంలోనూ పురుషులతో సమానంగా పనిచేస్తున్నారని అయినా కొన్నిచోట్ల వివక్ష తగ్గకపోగా వేధింపులు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర ఐకాస మహిళా ఛైర్మన్ పి.లక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. రామచంద్రపురం ఆర్డీవో కార్యాలయంలో ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం రామచంద్రపురం, కొత్తపేట జేఏసీ మహిళా విభాగం రెండు డివిజన్లలో ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెంటనే 12వ పీఆర్సీని అమలు చేయాలన్నారు. ఖాళీలు ఎక్కువగా ఉన్న కారణంగా ఒప్పంద ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వంలోకి తీసుకోవాలన్నారు. అమరావతి జేఏసీ ఛైర్మన్ బొప్పరాజు మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారన్నారు. జేఏజీ ఛైర్మన్ డి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సమావేశంలో మహిళా ఉద్యోగుల సమస్యలు నమోదు చేశామని, ఆయా విభాగాల ప్రతినిధుల, జిల్లా కలెక్టర్ దృష్టికి త్వరలో జిల్లా కమిటీ ద్వారా మెమోరాండం సమర్పిస్తామన్నారు. ఏఐటీయూసీ నాయకులు నాగ సుబ్బారెడ్డి మాట్లాడుతూ 92 రోజులు జేఏసీ చేసిన ఉద్యమంలో ఏఐటీయూసీ ముఖ్యపాత్ర పోషించి మద్దతు ఇచ్చిందన్నారు. జిల్లా ఛైర్‌పర్సన్ సీహెచ్ నాగ లక్ష్మమ్మ, జనరల్ సెక్రటరీ లహరి, కో ఛైర్ పర్సన్ శారద, అనురాధ, కార్యదర్శి సుజాత, పద్మావతి, ప్రియాంక, శైలజ, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, రామచంద్రపురం డివిజన్ అధ్యక్షులు జి.శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్, డివిజన్ ఉపాధ్యక్షులు పి.ఎస్.ఆర్ ప్రసాద్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

● కొత్తపేట డివిజన్ కార్యవర్గం: కొత్తపేట జేఏసీ మహిళా విభాగానికి సంబంధించి ఛైర్‌పర్సన్‌గా పి.నాగలక్ష్మి పద్మ, అసోసియేట్ ఛైర్మన్‌గా ఎస్.గణికమ్మ, కో ఛైర్మన్‌గా డి.మీనా, వి.జగదీశ్వరి, జనరల్ సెక్రటరీగా పి.వి.ఎల్ కుమారి, కార్యదర్శులుగా భారతి వెంకట లలితాదేవి, జి.ఆసం బేబి, కోశాధికారిగా కె.లావణ్యను ఎంపిక చేశారు.

కల నెరవేరేలా..

తూర్పుపాలెం వంతెన పనుల్లో కదలిక



అనుసంధాన రహదారి నిర్మాణం పూర్తి కాకపోవడంతో వంతెనపైకి కర్రల నిచ్చెన ఏర్పాటు

మలికిపురం, న్యూస్‌టుడే: తూర్పుపాలెం ప్రజల దశాబ్దాల కల శంకరగుప్తం మేజరు కాలువపై వంతెన నిర్మాణం. దానికోసం అలుపెరగని పోరాటం చేశారు. గత తెదేపా ప్రభుత్వంలో రూ.4.30 కోట్లు మంజూరు చేసి 2019లో నిర్మాణం పూర్తిచేసి ప్రారంభోత్సవం చేశారు. ఇరువైపులా అటు జి.పల్లిపాలెం, ఇటు తూర్పుపాలెం వైపున అనుసంధాన రహదారుల నిర్మాణం పూర్తికాలేదు. ఆ తర్వాత వైకాపా అధికారంలోకి వచ్చింది. ఐదేళ్లు నిర్లక్ష్యం వహించడంతో వంతెన ప్రజలకు ఉపయోగపడని దుస్థితిలో ఉండిపోయింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టింది.

● తూర్పుపాలెం-జి.పల్లిపాలెం గ్రామాలను కలుపుతూ శంకరగుప్తం మేజరు డ్రెయినుపై రామాలయం సమీపంలో కాలిబాట వంతెన ఉండేది. 1980 నాటికే అది పూర్తిగా శిథిలమై రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడేవారు. తూర్పుపాలెం వాసులు, రైతుల భూములు శంకరగుప్తం మేజరు డ్రెయినుకు ఆవలవైపు ఉండటంతో ఈ గ్రామ ప్రజలకు ఈ వంతెన ఉపయోగపడేది. అది కూలిపోవడంతో రేవు దాటడానికి 2019 వరకూ పడవే ఆధారమైంది. శిథిల కాలిబాట వంతెన స్థానే పక్కా వంతెన కోసం పోరాటం చేసిన ఫలితంగా తెదేపా ప్రభుత్వంలో ఎట్టకేలకు మంజూరై నిర్మాణం పూర్తయింది. అనుసంధాన రహదారికి అవసరమైన భూసేకరణ విషయంలో వివాదం ఏర్పడింది. వంతెనకు దివంగత అడబాల వెంకటరత్నం పేరు పెట్టాలని ఆయన సంస్మరణ సభలో అప్పటి ఎమ్మెల్యే ప్రకటించడం.. అనుసంధాన రహదారికి స్థలం ఇస్తున్న నేపథ్యంలో అడబాల నరసింహస్వామి పేరు పెట్టాలన్న అంశాన్ని తెరపైకి తెచ్చారు.

ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ..

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అనుసంధాన రహదారుల పనుల్లో కదలిక వచ్చింది. వివాదంలేని జి.పల్లిపాలెం వైపు వంతెనను ఆనుకొని కాంక్రీటు గోడలు నిర్మాణం పూర్తయి మట్టితో పూడ్చి అభివృద్ధి చేయడానికి సిద్ధమైంది. ప్రస్తుతం తూర్పుపాలెం వైపు కూడా కాంక్రీటు గోడలు నిర్మించి మట్టితో పూడిక పనులు చేపట్టాల్సి ఉంది. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఇటీవల ఈ వంతెనను పరిశీలించారు. ఎట్టి పరిసితుల్లోనూ పనులు ప్రారంభించి డిసెంబరు నెలాఖరు నాటికి పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.



శంకరగుప్తం మేజరు డ్రెయినుపై నిరుపయోగంగా ఉన్న అసంపూర్తి వంతెన

ఈవోటీ సమస్య..

వంతెన నిర్మాణం జాప్యమవడంతో గుత్తేదారు ఈవోటీ(ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టైమ్) లేఖ సీఈకి ఇవ్వాల్సి ఉంది. అది ఇవ్వకపోవడంతో సాంకేతికంగా సమస్య ఏర్పడింది. నిర్మాణ కాలాన్ని పొడిగిస్తూ సీఈ నుంచి ఉత్తర్వులు తీసుకొచ్చి సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకున్నాం. త్వరలో పనులు ప్రారంభించి పూర్తిచేస్తాం. ఈ విషయంలో ఎమ్మెల్యే కృషి చేస్తున్నారు.

- ఆర్.నాగార్జున, డీఈఈ, జలవనరులశాఖ (డ్రెయినేజీ విభాగం)

యానాంలో పెండింగ్ అంశాలపై సీఎం సమీక్ష

యానాం, న్యూస్‌టుడే: యానాంలో పలు పెండింగ్ అంశాలపై ముఖ్యమంత్రి రంగసామి అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. అవుట్ సోర్సింగ్ సిబ్బంది జీతాలు, ప్రజా పనుల శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు రూ.18 వేలు వేతనం పెంపు, యానాంలో రిక్రియేషన్ పేరుతో క్లబ్‌ల ఏర్పాటు చేయకుండా తీసుకోవాల్సిన చర్యలపై, వరద పరిరక్షణ గట్టు ప్రతిపాదనలు, వైఎస్సార్ లింకింగ్ ఛానల్ పనులపై సమీక్షించారు. వీటికి సంబంధించిన దస్త్రాలు ఆయా శాఖల డైరెక్టర్లు, కార్యదర్శులకు వెళ్లాయని.. కొన్ని లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదం కోసం పంపించారని దిల్లీలో పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పాల్గొన్నారు.

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

అర్హులంతా ఓటు నమోదు చేసుకోవాలి

కాట్రేనికోన: అర్హులందరూ ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దారు సునీల్‌కుమార్ తెలిపారు. కాట్రేనికోనలోని సిద్దార్థ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కొంకి రవి అధ్యర్యంలో గురువారం ఓటుహక్కుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. 18 ఏళ్లు దాటిన వారంతా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎం.నాగరాజు, ఎ.శ్రీనివాస్, ఎం.సతీష్, వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



ఫారం-6 దరకాస్తున్న అందిస్తున్న అధికారి



పరీక్షలు రాస్తున్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

సామాజిక అంశాలపై అవగాహన అవసరం

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ మనువిహార్ పేర్కొన్నారు. సమనసలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభ పాటవ పోటీ పరీక్షలు నిర్వహించారు. అంతర్జాల వినియోగంతో కలిగే లాభాలు, నష్టాలు, సామాజిక మాధ్యమ ప్రభావంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. ఎస్.ప్రావీణ్య, పి.ఎస్.ఎస్. సంహిత, వి.వైష్ణవి వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. అనంతరం విజేతలకు 'ఈనాడు' సమకూర్చిన బహుమతులు, ప్రశంసా పత్రాలను పాఠశాల డైరెక్టర్ మనువిహార్, ప్రిన్సిపల్ దీక్షిత్ అందించారు.



విజేతలతో డైరెక్టర్ మనువిహార్

టిడ్కో గృహం.. సమస్యల గ్రహణం

న్యూస్‌టుడే, అల్లవరం

ఇళ్ల చుట్టూ మురుగు, బురదగా మారిన పరిసరాలు, అధ్వాన రహదారులు, దోమల స్వైర విహారం ఇదీ.. టిడ్కో గృహ సముదాయాల్లో పరిస్థితి. పట్టణ పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు 2014లో తెదేపా ప్రభుత్వం వీటి నిర్మాణానికి సంకల్పించింది. వీటికి గుత్తేదారును ఎంపిక చేసి పనులు ప్రారంభించారు. 2019లో సార్వత్రిక ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో లబ్ధిదారులకు అందజేసేందుకు వీలుపడలేదు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా కనీస మౌలిక వసతులు కల్పించకుండానే 2023లో లబ్ధిదారులకు అప్పగించింది.

కనీస సదుపాయాలు కల్పించని వైనం

ప్రచారానికే ప్రజాధనం


అమలాపురం పట్టణ పేదలకు బోడసకుర్రు పంచాయతీ పరిధిలో దేవర్లంక ప్రాంతంలో 51 బ్లాకుల్లో 1,636 గృహాలను నిర్మించారు. వీటికి 2019లో వైకాపా అధికారం చేపట్టిన వెంటనే వైకాపా రంగులు వేసేందుకు రూ.కోట్లు ప్రజా ధనం వృథా చేశారు. ఈ నిధులతో వీరికి అవసరమైన వసతులు కల్పించే వీలున్నా ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. దీంతో టిడ్కో లబ్ధిదారులు అసౌకర్యాల నడుమ జీవనం సాగించాల్సిన దుస్థితి నెలకొంది

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

బోడసకుర్రు పంచాయతీ పరిధిలో ఉన్నా, నిర్వహణను అమలాపురం పురపాలికకు అప్పగించారు. ఇక్కడ పారిశుధ్య నిర్వహణ పనులను మున్సిపల్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఎక్కడికక్కడ చెత్త, ఇతర వ్యర్థాలు కుప్పలుగా పేరుకు పోతున్నాయి. ఒక బ్లాకులో నాలుగు అంతస్థులు నిర్మించారు. ఒక్కొక్క దానిలో 8 ఫ్లాట్లు ఉన్నాయి. పై అంతస్తుల్లో ఉన్న వారు వినియోగించిన వ్యర్థ జలం పైపుల ద్వారా కిందకు వచ్చి గ్రౌండ్ ఫ్లోర్ చుట్టూ నిలిచిపోతోంది. దుర్వాసన భరించలేకపోతున్నామని వారు వాపోతున్నారు.



గృహాల చుట్టూ మురుగు



గ్రౌండ్ ఫ్లోర్ వద్ద చేరిన మురుగు నీరు

కూటమి ప్రభుత్వంపై ఆశలు..

వీటి నిర్మాణాలను ప్రారంభించి తెదేపా మళ్లీ అధికారంలోకి రావడంతో తమకు మంచి రోజులు వచ్చే అవకాశం ఉందని టిడ్కో లబ్ధిదారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరుతున్నారు.

తాత్కాలిక డ్రెయిన్ నిర్మాణానికి చర్యలు

బోడసకుర్రు టిడ్కో గృహ సముదాయం నుంచి మురుగు బయటకు వెళ్లేందుకు డ్రెయిన్ నిర్మాణం చేయాల్సి ఉంది. దీనికి గత ప్రభుత్వంలో అంచనాలు పంపినా నిధులు మంజూరు కాలేదు. ప్రస్తుతం తాత్కాలిక డ్రెయిన్ నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. త్వరలోనే సమీపంలో ఉన్న భూ యజమానులతో సమావేశం నిర్వహించి సమస్య పరిష్కరిస్తాం. విడిగా చర్యలు తీసుకుంటాం.

\- రాజు, పురపాలిక కమిషనర్, అమలాపురం

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

అల్లవరం: దేవగుప్తం విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్తును నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

కాట్రేనికోన: స్థానిక ఉప విద్యుత్తుకేంద్రం పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా ఉండదని డీఈ రవికుమార్ తెలిపారు. కాట్రేనికోన, పల్లం, కందికుప్ప, కొత్తపాలెం, మొల్లేటిమొగ, బలుసుతిప్పకు సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

బస్సు ఏర్పాటు చేయాలి

యానాం: కనకాలపేట నుంచి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు బస్సును ఏర్పాటు చేయాలని పుదుచ్చేరి రవాణా శాఖ కమిషనర్ శివకుమార్‌ను మల్లాడి కృష్ణారావు కోరారు. యానాంలోని రవాణా సంబంధించిన సమస్యలపై కమిషనర్‌తో గురువారం ఆయన మాట్లాడారు.

ఉద్యోగుల ఆందోళనకు మద్దతు

యానాం: యానాంలోని ప్రజా పనుల శాఖ ఈఈ కార్యాలయం వద్ద చేపట్టిన ఉద్యోగుల ఆందోళన రెండోరోజుకు చేరింది. ఉద్యోగుల ఆందోళనకు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి. దుర్గాప్రసాద్, యానాం సీఐటీయూ నాయకులు ఇళ్ల వాసు మద్దతు తెలిపారు.

కుండలేశ్వరుడికి ప్రత్యేక పూజలు

కాట్రేనికోన: పార్వతీసమేత కుండలేశ్వరాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారు, అమ్మవారిని వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారు.



అలంకరించిన స్వామివారు

సూరిబాబుకు పలువురి పరామర్శ

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: మాతృవియోగంతో ఉన్న తెదేపా నాయకుడు సాగిరాజు సూరిబాబును పలువురు పరామర్శించారు. అమలాపురం ఎంపీ హరీష్ మాథుర్, పెద్దాపురం, అమలాపురం ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, అయితాబత్తుల ఆనందరావు, మాజీమంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద తదితరులు సూరిబాబు ఆయన మాతృమూర్తి లక్ష్మీకాంతం చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు.

పరుగు పోటీలో ప్రతిభ

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: భీమనపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న **రాకుర్తి సిరిసత్యప్రశాంతి** జిల్లా స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో ప్రతిభ చాటింది. రాజమహేంద్రవరంలో నిర్వహించిన పరుగు పందెంలో అండర్-14 విభాగంలో 400 మీటర్లలో మూడోస్థానం, 600 మీటర్లలో నాలుగో స్థానం సాధించిందని హెచ్ఎం నూకల సత్యనారాయణ తెలిపారు. ఆ విద్యార్థినిని పీడీలు కామన మధుసూదనరావు, కరాటం ప్రసాద్, సర్పంచి రాజ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు నాగరత్నకుమారి అభినందించారు.



వంట సామగ్రి అందజేత

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఒక భక్తుడు రూ.10వేలు విలువ చేసే వంట సామగ్రిని గురువారం బహూకరించారు. ముమ్మిడివరానికి చెందిన దేవత సత్యనారాయణమూర్తి దంపతులు ప్లాస్టిక్ డ్రమ్ములు, ఇతర సామగ్రి అందించారు.

రహదారి ఆధునికీకరించాలని వినతి

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉప్పలగుప్తం మండలం ఎస్.యానం నుంచి అమలాపురం ఎర్రవంతెన వరకు ఉన్న ప్రధాన రహదారిని ఆధునికీకరించాలని చల్లపల్లి ప్రజలు గురువారం కలెక్టర్ మహేష్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. చల్లపల్లి పంచాయతీ పరిధిలో జగ్గిరాజుపేటలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న చమురు సంస్థ ఓఎన్జీసీ సంస్థ నుంచి చమురు నిల్వలను ఇతర ప్రాంతాల తరలించే క్రమంలో భారీ వాహనాల రాకపోకల వల్ల రహదారులు అధ్వానంగా మారుతున్నాయన్నారు. ఎనిమిదేళ్ల నుంచి కనీస మరమ్మతులు నిర్వహించలేదన్నారు. గతంలో ఓఎన్జీసీ వాహనాల రాకపోకలు నిలుపుదల చేసిన సమయంలో ఇచ్చిన హామీలను సైతం అధికారులు నిలబెట్టుకోలేదన్నారు. ఇసుకపట్ల రఘుబాబు, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్థులు

సభ్యత్వ నమోదు చేయించాలి

అమలాపురం పట్టణం: జిల్లాకు నిర్దేశించిన భాజపా సభ్యత్వాలను నమోదును మండల అధ్యక్షులు పూర్తి చేయాలని సంఘటన మంత్రి జి.మధుకర్ సూచించారు. భాజపా అమలాపురం పార్లమెంట్ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యశాల అమలాపురం పట్టణంలో గురువారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అయ్యాజీ వేమ, జిల్లా ఇంఛార్జి పొట్లూరి రామ్మోహనరావు, పాలూరి సత్యనందం, కర్రి చిట్టిబాబు, ఇళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మధుకర్

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి పడిపూజ

ముమ్మిడివరం: ముమ్మిడివరంలో అయ్యప్పస్వామి పడిపూజా కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. రమేష్ గురుస్వామి 25వ సారి మాలధారణ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన స్వాములు పవిత్ర జలాలను కలశాలతో స్థానిక అయ్యప్పస్వామి ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. కార్యక్రమంలో పెన్మత్స జగ్గప్పరాజు, సీతారాముడు, కె.రామలింగేశ్వరరావు, చిన్నారావు, ఎం.లక్ష్మణరావు, బి.అయ్యప్ప, ఆర్.గోవిందు, గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, తాడి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



ఊరేగింపుగా వెళ్తున్న స్వాములు

వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఏపీఈపీడీఎసీఎల్ విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం ఛైర్మన్ బి.సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం ఈదరపల్లిలోని డివిజన్ కార్యాలయంలో విద్యుత్తు వినియోగదారుల సదస్సులో ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది ఇప్పటి వరకు 395 ఫిర్యాదులు అందగా.. 315 పరిష్కరించామన్నారు. నిర్లక్ష్యం వహించిన ఉద్యోగులకు 107 కేసుల్లో రూ.14.26 లక్షల అపరాధ రుసుం విధించామన్నారు. న్యాయస్థానం సభ్యుడు షేక్ బాబర్, ఎస్ఈ రాజబాబు, ఈఈలు రవికుమార్, విజయానంద్, ఏడీఏ అన్నవరం తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న న్యాయస్థానం ఛైర్మన్ సత్యనారాయణ

గ్రామసభలో 48 అర్జీల స్వీకరణ

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: గతంలో జరిగిన భూ రీసర్వేపై విలసవిల్లి గ్రామంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. 48 మంది అర్జీలు అందజేసినట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు. సర్పంచి సలాది ఊర్మిళాదేవి, తహసీల్దారు వి.దివాకర్, సలాది సతీష్, తదితరులు పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులపై న్యాయం చేయాలి

కాట్రేనికోన, న్యూస్‌టుడే: భర్తను తనకు దూరం చేస్తూ వేధింపులకు గురిచేస్తున్న అత్తమామలు, వారి కటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని బలుసుతిప్పకు చెందిన పి.లక్ష్మి కోరారు. కాట్రేనికోనలో గురువారం ఆమె మాట్లాడుతూ బలుసుతిప్పకు చెందిన ఎస్.భైరవస్వామి, తాను ఈ ఏడాది జనవరిలో కాకినాడలో వివాహం చేసుకుని మూడు నెలలు కలిసి ఉన్నామన్నారు. మా పెళ్లి ఇష్టంలేని అత్తమామలు తన నుంచి భర్తను దూరంచేసి మరొకరితో వివాహం చేసేందుకు చూస్తున్నారన్నారు. మార్చిలో పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేసినా తనకు న్యాయం జరగలేదని వాపోయారు. అత్తింటివారు తనపై దుర్భాషలాడి దాడిచేసి బయటకు నెట్టేశారన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: అమలాపురం ఆర్టీసీ డిపో నుంచి విజయవాడకు అల్ట్రా డీలక్స్ నూతన బస్సును ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబుతో కలిసి గురువారం ప్రారంభించారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితంగా, సుఖవంతంగా ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, కౌన్సిలర్ యేడిద శ్రీను, నాయకులు తిక్కిరెడ్డి నేతాజీ, జంగా అబ్బాయివెంకన్న, వలవల శివరావు, డిపో మేనేజర్ సీహెచ్.సత్యనారాయణమూర్తి, విజిలెన్సు అధికారి రామారావు, జి.ఆర్.ఎల్.దేవి, ప్రతిమాకుమారి, వరహాలబాబు తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

వసతుల కల్పనకు కృషి..

అల్లవరం: బెండమూర్లంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అవసరమైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆనందరావు హామీ ఇచ్చారు. గురువారం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 24 గంటలూ రోగులకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషారావు, జడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, వైద్యాధికారి బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అవసరాలు తీర్చడమే లక్ష్యం

అల్లవరం: ప్రజల కనీస అవసరాలు తీర్చడమే కూటమి ప్రభుత్వ ప్రధాన అజెండా అని ఎమ్మెల్యే ఆనందరావు పేర్కొన్నారు. గురువారం గోపాయిలంకలో ఉపాధి హామీ నిధులతో నిర్మించే సీసీ రహదారి పనులను శంకుస్థాపన చేశారు. సర్పంచి చిట్నీడి శ్రీదేవి, నాయకులు కల్వకొలను తాతాజీ, ముత్యాల బాబి, మాకిరెడ్డి సత్తిబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అరగంట ముందే హాజరు కావాలి

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరిలో ఈ నెల 27న నిర్వహించనున్న ప్రజా పనుల శాఖ జూనియర్ ఇంజినీరు, ఓవర్‌సీర్ ఉద్యోగాల రాత పరీక్షలకు అరగంట ముందుగానే చేరుకోవాలని పరీక్ష నియంత్రణ అధికారి పంకజ్‌కుమార్ ఝా ఓ ప్రకటనలో సూచించారు. అభ్యర్థుల వేలిముద్రలు నమోదైన తర్వాతే కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు.

కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వండి

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: కౌలు రైతులకు హామీ లేకుండా పంట రుణాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కార్యదర్శులు డేగా ప్రభాకర్, కౌలు రైతు సంఘ ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో కె.సత్తిబాబు ఆధ్వర్యంలో గురువారం కౌలు రైతుల జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంత మంది భూయజమానులు కౌలుకిచ్చి పంట రుణాలను వారే తీసుకునే విధానాన్ని నియంత్రించాలని కోరారు. కార్యక్రమంలో ధన సత్యనారాయణ, సీహెచ్.కేశవశెట్టి, బుజ్జిబాబు, కె.వరుణ్‌బాబు, శీలం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో చర్చిస్తున్న నాయకులు



అధికారులతో మాట్లాడుతున్న గ్రామస్థులు

గ్రామస్థుల ఆందోళన

ఉప్పలగుప్తం: చమురు సంస్థల యాజమాన్యం గతంలో హామీ ఇచ్చిన మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని ఉప్పలగుప్తం పంచాయతీ ఏటిమెరక గ్రామస్థులు స్థానిక డ్రిల్లింగ్ సైట్ వద్ద ఆందోళన చేపట్టారు. సర్పంచి కడిమి చిన్నవరాజు, తహసీల్దారు దివాకర్, ఎస్సై రాజేష్, ఓఎన్జీసీ అధికారులు 20 రోజుల్లో నిర్మాణాలు పూర్తిచేస్తామని చెప్పడంతో గ్రామస్థులు గురువారం ఆందోళన విరమించారు.

డొక్కు వాహనాలతో.. పారిశుద్ధ్యం ఎలా..?

మరమ్మతుల్లో చెత్త తరలించే వాహనాలు

న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

జిల్లా కేంద్రం అమలాపురం పట్టణంలో పారిశుద్ధ్యం నిర్వహణ అధ్వానంగా ఉంది. చెత్త తరలించే వాహనాలు మరమ్మతులకు గురికావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పురపాలక సంఘంలో ట్రాక్టర్లు 11 ఉన్నాయి. మరమ్మతులకు గురికావడంతో ఓ టిప్పర్, రెండు ట్రాక్టర్లను పక్కన పెట్టారు. మిగతా వాహనాలూ సరిగా లేవు. గతంలో ఆరు నెలల్లో రూ.10 లక్షలతో మరమ్మతులు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. చెత్త తరలింపునకు రూ.కోట్లు వెచ్చిస్తున్నా లక్ష్యం నెరవేరడం లేదు. పారిశుద్ధ్యం అధ్వానంగా మారడంతో దోమల బెడదతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



ట్రాక్టర్ పరిస్థితి

పురపాలిక ముఖ చిత్రం

పురపాల సంఘం	అమలాపురం
విస్తీర్ణం	7.02 చ.కి.మీ.
వార్డులు	30
జనాభా	65వేలు
గృహాలు	15,000
పారిశుద్ధ్య కార్మికులు	139
మున్సిపల్ ట్రాక్టర్లు	11
క్లాప్ వాహనాలు	12
రోజు సేకరించే చెత్త	38 టన్నులు

నిధులు ఖర్చు చేస్తున్నా..

పురపాలక సంఘంలో పారిశుద్ధ్య నిర్వహణకు 12 క్లాప్ వాహనాలకు నెలకు రూ.7.23 లక్షలు చెల్లించాలి. వీటితో పాటు పారిశుద్ధ్య నిర్వహణకు గత రెండేళ్లలో మరో రూ.50 లక్షలు వెచ్చించారు.

వ్యాధుల భయం..

వడ్డెరకాలనీ, మున్సిపల్ కాలనీ, కార్మికనగర్, మార్కెట్ ప్రాంతం, సూర్యనారాయణ పేట, నల్లవంతెన బైపాస్, సావరం, కె.అగ్రహారం, భూపయ్య అగ్రహారం ప్రాంత ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. వడ్డెగూడెం, విద్యుత్తునగర్, కుంకాల కొట్టు వీధి, గొల్లగూడెం, రావులచెరువు, కార్మికనగర్, విత్తనాలవారి కాలువ గట్టు ప్రాంతాల్లోని ప్రజలు డ్రెయిన్లు, పారిశుద్ధ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు.



పురపాలిక సంఘ కార్యాలయం వద్ద ట్రాక్టర్లు

శుభ్రతకు ప్రాధాన్యం

పట్టణంలో పరిసరాల శుభ్రతకు పెద్దపీట వేస్తున్నాం. క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య లోపంపై ఫిర్యాదులు అందుతున్నాయి. ట్రాక్టర్ల మరమ్మతులకు ఈ ఏడాదిలో ఆరు నెలలకు రూ.5 లక్షలు కేటాయించారు. టిప్పర్ రెండేళ్లుగా పనిచేయడం లేదు. మరమ్మతులకు చర్యలు తీసుకున్నాం. ప్రజలు తమకిచ్చిన డబ్బాలలో చెత్తను నింపి వాహనాలకు అందజేయాలి. ఎక్కడ పడితే అక్కడ వేస్తే జరిమానా విధిస్తాం. సచివాలయ సిబ్బందిని అప్రమత్తం చేస్తాం.

\- వెంకటేష్, అమలాపురం మున్సిపల్ ఏఈ

మండపేట
•మండపేట •రామచంద్రపురం

దీపావళి సామగ్రి విక్రయదారులు నిబంధనలు పాటించాలి

మండపేట, న్యూస్‌టుడే: దీపావళి సామగ్రి విక్రయదారులు తప్పని సరిగా నిబంధనలు పాటించాలని రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ ఆదేశించారు. గురువారం స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బాణసంచా విక్రయదారులతో సమావేశం నిర్వహించారు. లైసెన్సు పొందిన వారు మాత్రమే దీపావళి సామగ్రి విక్రయించాలన్నారు. అగ్నిమాపక అధికారి హనుమంతరావు మాట్లాడుతూ ప్రతి దుకాణానికి మధ్య మూడు అడుగులు ఖాళీ ఉండాలన్నారు. అగ్నిప్రమాదాలు నివారించేందుకు నీరు, ఇసుక, అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మండపేట రూరల్ సీఐ దొరరాజు, మండపేట ఎస్సై హరికోటి శాస్త్రి, రూరల్ ఎస్సై సురేష్ బాబు, సుమారు 25 మంది మందుగుండు సామగ్రి విక్రయదారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ రామకృష్ణ


రాజశేఖర్‌ను పరిచయం చేస్తున్న ఎమ్మెల్యే జోగేశ్వరరావు

ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్‌ను గెలిపించాలి

మండపేట, న్యూస్‌టుడే: పట్టభద్రుల నియోజకవర్గం కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. [illegible] గల కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార, ఓటరు నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త పట్టభద్రుల ఓటు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, కూటమి నాయకులు వేగుళ్ల లీలాకృష్ణ, కేవీవీ సాయిరాం, మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు నల్లమిల్లి వీర్రెడ్డి, కోన సత్యనారాయణ, చుండ్రు శ్రీవరప్రకాష్, యరగతపు బాబ్జి పాల్గొన్నారు.

రామచంద్రపురం ఆర్డీవోగా అఖిల



రామచంద్రపురం: రామచంద్రపురం రెవెన్యూ డివిజనల్ అధికారిగా దేవరకొండ అఖిల నియమితులైనట్లు గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇటీవల రామచంద్రపురం ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన కె.కొసర్ బానో తాడేపల్లిగూడెం ఆర్డీవోగా బదిలీపై వెళ్లడంతో బీరాల ఆర్డీవోగా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన అఖిల రామచంద్రపురంలో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈమె కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ సతీమణి కావడంతో రామచంద్రపురం బదిలీపై వస్తున్నట్లు సమాచారం. అలాగే కొసర్‌బానో తాడేపల్లిగూడెం బదిలీపై వెళ్తున్నట్లు తెలిసింది.

హద్దు లేని ధరలు.. గొంతు దిగని ముద్ద

✦ మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులకు అప్పులు..
✦ విద్యార్థులకు తిప్పలు

పామర్రు, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనం రుచి తప్పుతోంది. వంట సామగ్రి, కూరగాయలు, పప్పు దినుసులు, నూనెల ధరలు బాగా పెరిగిపోవడంతో కొనలేక తిప్పలు పడుతున్నారు.. దీంతో నాణ్యత తగ్గిన భోజనంతో విద్యార్థుల గొంతు దిగడం లేదు. రెండేళ్ల కిందట ఇచ్చిన ధరలే ఇప్పటికీ అమలు చేస్తున్నారని పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలో 324 పాఠశాలల్లో 22,539 మంది విద్యార్థులు 1 నుంచి 10 తరగతులు చదువుతున్నారు. వీరిలో గతంలో 80 శాతం వరకూ భోజనం చేసేవారు. ఇపుడు అది 65 శాతానికి పలు చోట్ల పడిపోయింది.


సత్యవాడ ప్రాథమిక పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

మెనూ మార్చారు.. నిధులు పెంచలేదు

రెండేళ్ల కిందట మెనూ మార్చారు. విద్యార్థులు ఇష్టంగా తినే బిర్యానీ, పులిహోర, కిచిడి, రాగిజావ, సాంబార్‌బాత్, పరమాన్నం లాంటి పోషకాహార పదార్థాలను మెనూలో చేర్చారు. ప్రతి రోజూ ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేయడం, వండి వడ్డిస్తున్న పదార్థాల రుచి ఎలా ఉన్నాయోనని సంబంధిత యాప్‌లో ఏ రోజుకారోజు నమోదు చేయాలి. ప్రస్తుతం నిత్యావసరాల ధరలు పెరిగాయి. నూనెలు కాగుతున్నాయి. గ్యాస్‌బండ ధర బరువెక్కింది. ఉప్పు, పప్పులు ధరలు పెరిగాయి. దీంతో నిర్వాహకులు భోజన నాణ్యతలో కోత పెట్టక తప్పడం లేదంటున్నారు.

విద్యార్థికి ఇచ్చే నగదు వివరాలు

ప్రాథమిక పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి రూ.5.58, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు రూ.8.57 చొప్పున చెల్లిస్తున్నారు. వీటిని రూ.8.90, రూ.10లకు చేరిస్తే కానీ నిర్వహణ సక్రమంగా సాగదని పలువురు అంటున్నారు. కె.గంగవరం ఉన్నత పాఠశాలలో గురువారం మెనూ ప్రకారం సాంబార్ బాత్, టమోటా పచ్చడి, ఉడికించిన గుడ్డు పెట్టారు. 274 మంది భోజనం చేశారు. ప్రభుత్వం ద్వారా నిర్వాహకులకు రూ.2252.50 అందుతాయి. ఇందులో కూరగాయలకే రూ.1500 ఖర్చయిపోయాయని, ఇంక మిగిలిన గ్యాస్, కిరాణా, ఇతరత్రా ఖర్చులకు మరో రూ.1500 ఖర్చయిందంటున్నారు. ఇలా ప్రతి రోజూ చేతి చమురు వదులుతోందని, అప్పులు చేయాల్సి వస్తోందని వంట నిర్వాహకులు చెప్పారు.

అప్పుల పాలవుతున్నాం..



ధరలు పెరగడం మా వంట నిర్వాహకుల పాలిట శాపంగా మారింది. పోనీ సరుకులు తగ్గించి తెస్తే వంట రుచిగా లేదని పిల్లలు సరిగా తినడం లేదు. భోజనం మానేసి ఇళ్లకు వెళ్లిపోతున్నారు. బిల్లు లేక అప్పులు చేసి సరుకులు కొనుగోలు చేస్తున్నాం. పోనీ నిధులైనా వెంటనే ఇస్తారంటే అవీ ఇవ్వడం లేదు. మాకు మూడు నెలల బకాయిలు రావాల్సి ఉంది. అధికారులు తగిన విధంగా స్పందించి ప్రతి విద్యార్థికిచ్చే డబ్బులు పెంచితే మాకు కొంత ఉపశమనంగా ఉంటుంది.

- ముమ్మిడి అనంతలక్ష్మి, ప్రాథమిక పాఠశాల, సత్యవాడ, కె.గంగవరం మండలం

నాణ్యతతో పెట్టాల్సిందే.. డీవైఈవో

పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు నాణ్యతతో భోజనం పెట్టాల్సిన బాధ్యత నిర్వాహకులదే. బకాయిలున్నా త్వరలో వస్తాయి. ధరలు పెరిగినప్పటికీ భోజనం సక్రమంగా వండి పిల్లలకు మెనూ ప్రకారం అమలు చేయాలి. ప్రధానోపాధ్యాయులు కూడా పథకం సరిగా ఉండేలా ప్రతి రోజూ పర్యవేక్షించాలి.

- శ్రీపాద లక్ష్మీనరసింహ ఫణి, డీవైఈవో, రామచంద్రపురం

డంపింగ్ యార్డు సమస్యకు కదలిక

ఈనాడు కథనానికి స్పందన

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న ద్రాక్షారామ డంపింగ్ యార్డు సమస్యకు మరో పదిరోజుల్లో శాశ్వత పరిష్కారం లభించనుంది. ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయానికి కూతవేటు దూరంలో రహదారిపైనే చెత్తను డంప్ చేస్తున్నారు. దీనిపై ఈనాడులో వరుస కథనాలు వెలువడుతున్న నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, అధికారుల్లో కదలిక వచ్చింది. మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేక శ్రద్ధ కనబరచి ఇటీవల ఆదివారపుపేట ప్రభుత్వ స్థలంలో రెండు ఎకరాలు కేటాయించారు. అయినా మళ్లీ రోడ్డపై చెత్తను వేస్తుండటంతో 'కార్తికం వస్తున్నా... ఎక్కడి చెత్త అక్కడే' శీర్షికతో గురువారం కథనం వెలువడింది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుపై చెత్తను జేసీబీతో ఎత్తించి వేరే చోటికి తరలించారు. ఆదివారపుపేటలో కొత్తగా కేటాయించిన రెండెకరాల స్థలం వినియోగంలోకి తీసుకురావడానికి మార్గమధ్యలో కల్వర్టు నిర్మించాల్సి ఉండగా దానికి శుక్రవారం శంకుస్థాపన చేసి పనులు మొదలు పెడుతున్నట్టు ఎంపీడీవో పద్మజ్యోతి 'న్యూస్‌టుడే'కు వివరించారు. ఇకపై ద్రాక్షారామలో డంపింగ్ యార్డు సమస్య ఉండబోదని, ఆదివారపుపేటలో రెండు ఎకరాల స్థలంలో పక్క రైతులకు ఇబ్బంది లేకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రహదారికి కల్వర్టు కూడా వెంటనే ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. మరో పది రోజుల్లో ఈ పనులు పూర్తయితే గ్రామంలో సేకరించిన చెత్తను అక్కడికే తరలించే ఏర్పాటు చేస్తామన్నారు.


శ్మశాన వాటిక ముందు జేసీబీతో చెత్త తరలింపు

'మహిళలపై ఇంకా వివక్ష తగ్గలేదు'

రామచంద్రపురం, న్యూస్‌టుడే: మహిళలు ప్రతి విభాగంలోనూ పురుషులతో సమానంగా పనిచేస్తున్నారని అయినా కొన్ని చోట్ల వివక్షత తగ్గకపోగా వేధింపులు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర ఐకాస మహిళా ఛైర్మన్ పి.లక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. రామచంద్రపురం ఆర్డీవో కార్యాలయంలో ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం రామచంద్రపురం, కొత్తపేట జేఏసీ మహిళా విభాగం రెండు డివిజన్లలో ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెంటనే 12వ పీఆర్సీని అమలు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వంలోకి తీసుకోవాలన్నారు. అమరావతి జేఏసీ ఛైర్మన్ బొప్పరాజు మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారన్నారు. జేఏజీ ఛైర్మన్ డి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సమావేశంలో మహిళా ఉద్యోగుల సమస్యలు నమోదు చేశామని, ఆయా విభాగాల ప్రతినిధుల, జిల్లా కలెక్టర్ దృష్టికి త్వరలో జిల్లా కమిటీ ద్వారా మెమోరాండం సమర్పిస్తామన్నారు. ఏపీటీయూసీ నాయకులు నాగ సుబ్బారెడ్డి మాట్లాడుతూ 92 రోజులు జేఏసీ చేసిన ఉద్యమంలో ఏపీటీయూసీ ముఖ్యపాత్ర పోషించి మద్దతు ఇచ్చిందన్నారు. జిల్లా ఛైర్‌పర్సన్ సీహెచ్ నాగ లక్ష్మమ్మ, జనరల్ సెక్రటరీ లహరి, కో ఛైర్ పర్సన్ శారద, అనురాధ, కార్యదర్శి సుజాత, పద్మావతి, ప్రియాంక, శైలజ, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, రామచంద్రపురం డివిజన్ అధ్యక్షులు జి.శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్, డివిజన్ ఉపాధ్యక్షులు పి.ఎస్.ఆర్ ప్రసాద్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


నూతనంగా ఎన్నికైన జేఏసీ మహిళా ప్రతినిధులు

★ **రామచంద్రపురం డివిజన్ కార్యవర్గం:** రామచంద్రపురం డివిజన్‌కు సంబంధించి మహిళా జేఏసీ డివిజన్ ఛైర్‌పర్సన్‌గా లోడ ఝాన్సీ లక్ష్మీ కుమారి, అసోసియేట్ ఛైర్మన్‌గా డి.చైతన్య కుమారి, కో ఛైర్మన్‌గా కె.విజయరేఖ, ఎం.బిందు, ప్రధాన కార్యదర్శిగా జి.ఎల్.కుమారి, కార్యదర్శులుగా లక్ష్మీలత, హరి చందన, కోశాధికారిగా పి.పార్వతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

అంగర: కపిలేశ్వరపురం మండలంలోని అంగర విద్యుత్తు సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ కె.రత్నాలరావు తెలిపారు. కపిలేశ్వరపురం, అంగర, టేకి, మాచరమట్టలు, శ్రీరామపురం, నల్లూరు, కాలేరు, సుభద్రపురం, అచ్యుతాపురం, వడ్లమూరు, నిడసనమెట్ట, వెదురుమూడి, వల్లూరు, నేలటూరు గ్రామాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా నిలిపేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ద్రాక్షారామ: ద్రాక్షారామ విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో శుక్రవారం పలు గ్రామాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని డీఈఈ కె.రత్నాలరావు తెలిపారు. వెల్ల, ద్రాక్షారామ, హసనబాద, వెంకటాయపాలెం, పీడబ్ల్యూఎస్ ఫీడర్లు మరమ్మతులు చేస్తున్నట్లు వివరించారు. దీని వల్ల వెల్ల, వెల్లసావరం, తాడిపల్లి, కాపవరం, ద్రాక్షారామ టౌన్, వెంకటాయపాలెం, పెద్ద తాళ్లపొలం, ఏరుపల్లి, ఆదివారపుపేట, ఉండూరు, భీమక్రోసుపాలెం గ్రామాల్లో సరఫరా ఉండదన్నారు.

ద్వారపూడి: మండపేట మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని రామచంద్రాపురం సెక్షన్ డీఈ కొల్లి రత్నాలరావు తెలిపారు. ద్వారపూడి సెక్షన్ పరిధిలో తాపేశ్వరం సబ్‌స్టేషన్ వార్షిక మరమ్మతుల్లో భాగంగా తాపేశ్వరం, అర్తమూరు, ఇప్పనపాడు, వెలగతోడు, పాలతోడు, చినద్వారపూడి గ్రామాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్తు నిలుపుదల చేస్తామన్నారు.

సైబర్ నేరాల వలలో చిక్కుకోవద్దు

పామర్రు, న్యూస్‌టుడే: నిత్యం పలు చోట్ల సైబర్ నేరాలు పెరిగిపోయాయి. ఏదో విధంగా పలువురు తమ నగదును కోల్పోతున్నారు. అమాయకులు, భయస్తులను వారు లక్ష్యంగా చేసుకుంటున్నారు. వీటిని విద్యార్థులు, యువజనులు చైతన్యంతో అదుపులోకి తేవాలని పామర్రు ఎస్సై షేక్ జానీబాషా అన్నారు. మండలంలోని పది ఉన్నత పాఠశాలల్లో గురువారం విద్యార్థులకు సైబర్ నేరాలు- యువత పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోలీసుల విధులు, బాధ్యతలు అంశం మీద డ్రాయింగ్ పోటీ పెట్టారు. కె.గంగవరంలో జరిగిన పోటీలను ఆయన పర్యవేక్షించారు. తొలుత విద్యార్థులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పోటీలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పొడగట్లపల్లి వెంకటేశ్వరరావు, ఆప్‌కాస్ట్ జిల్లా అకడమిక్ సమన్వయకర్త ప్రక్కి వీర బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.


ద్రాక్షారామ జెడ్పీ ఉన్నత పాఠశాల సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై లక్ష్మణ్

ఏ సమస్య వచ్చినా ఫోన్ చేయండి

ద్రాక్షారామ: మీకు ఏ సమస్య వచ్చినా 100 లేదా 112 నంబరుకు కాల్ చేస్తే తక్షణం స్పందించి మీకు సహాయపడతామని ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ అన్నారు. బాలికలపై జరుగుతున్న అకృత్యాలను ఎలా ఎదుర్కోవాలో చర్చించేందుకు ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం ద్రాక్షారామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహనా సదస్సు నిర్వహించారు. విద్యార్థినులపై ఎలాంటి వేధింపులను సహించబోమని, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలికల రక్షణకు కఠిన చట్టాలు ఉన్నాయని వాటిని అమలు చేయడంలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని సీహెచ్ రత్నపద్మావతి, జిల్లా సైన్సు అధికారి సుబ్రహ్మణ్యం, అరవ విశ్వేశ్వరరావు, మెహర్‌సుజాత పాల్గొన్నారు.

కృత్తివెంటి విద్యాసంస్థల ప్రాంగణాన్ని శుభ్రం చేద్దాం

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం

రామచంద్రపురం: పట్టణంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు విద్యాసంస్థల క్రీడా ప్రాంగణానికి ఆటల నిమిత్తం, నడక నిమిత్తం ఎంతో మంది పట్టణ వాసులు నిత్యం వెళ్తారని ఆ ప్రాంగణాన్ని పురపాలక సంఘం ఆధ్వర్యంలో శుభ్రం చేయించాల్సి ఉందని రామచంద్రపురం 23వ వార్డు కౌన్సిలర్, పురపాలక కౌన్సిల్ విప్ వాడ్రేవు సాయి ప్రసాద్ పేర్కొన్నారు. రామచంద్రపురం పట్టణ పురపాలక సంఘ సమావేశం మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. తొలుత నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అయ్యప్పనాయుడును సభకు ఛైర్‌పర్సన్ పరిచయం చేశారు. ఇటీవల మృతిచెందిన 27వ వార్డు కౌన్సిలర్ కట్టా శ్రీరాములు మృతిపట్ల కౌన్సిల్ రెండు నిమిషాల పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించింది.


మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ శ్రీదేవి

నాలుగు అంశాలు ఆమోదం

ఈ సందర్భంగా జరిగిన కౌన్సిల్ సమావేశంలో అజెండాలోని నాలుగు అంశాలలో రూ.3.5కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన 22 పనులకు సంబంధించి మంచినీటి నిర్వహణ, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కాలువలు, రహదారుల నిర్మాణ పనులకు ఆమోదం కోసం పంపించేందుకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది.

ఇవీ పరిష్కరించండి

★ అనంతరం జరిగిన జీరో అవర్‌లో సాయి ప్రసాద్ మాట్లాడుతూ కృత్తివెంటి క్రీడా ప్రాంగణం దేవాదాయశాఖకు చెందినది కనుక సంబంధిత ట్రస్టు ఈవోకు ప్రాంగణాన్ని శుభ్రం చేయించాలని పురపాలక సంఘం నుంచి లేఖ రాయాలని కోరారు. ★ విద్యాసంస్థల ఎదుట ప్రధాన రోడ్డుపై వేగ నిరోధకాలు వేయించాలని, ప్రధాన రోడ్డులో మధ్యస్థ వీధి దీపాలకు స్వాతంత్ర్యపు జెండా రంగుల వలే అన్ని పురపాలక సంఘాల్లో ఉన్నవిధంగా విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. ★ పురపాలక సంఘానికి సుమారు రూ.8లక్షలు విద్యుత్తు బిల్లులు వస్తున్నాయని సోలార్‌వైపు అభివృద్ధి చేస్తే పట్టణానికి బిల్లులు ఖర్చు తగ్గుతుందని ఆ దిశగా ఆలోచించాలని వేడుకున్నారు. ★ గత ఏడాదే మండపేట పట్టణంలానే రామచంద్రపురం పట్టణానికి ప్రవేశ ద్వారాలు ఏర్పాటు చేయాలని నిధులను బట్టి ఈ పనులపై దృష్టి సారించాలని కోరారు. ★ ఈ పనులకు వైస్ ఛైర్మన్ కోలమూరి శివాజి, ఇతర కౌన్సిలర్లు స్వపక్ష, విపక్ష కౌన్సిలర్లంతా సమ్మతించారు. దీనితో ఆ దిశగా ఆలోచన చేద్దామని ఛైర్‌పర్సన్ శ్రీదేవి, కమిషనర్ అయ్యప్పనాయుడు పేర్కొన్నారు.

నిల్వ పదార్థాలు ఉపయోగించకుండా చర్యలు

మండపేట, న్యూస్‌టుడే: మండపేట పట్టణంలోని హోటళ్లు , ఫాస్ట్‌ఫుడ్ రెస్టారెంట్లలో ఆహార పదార్థాలు, మాంసాహార వంటకాలు నిల్వ చేసినవి వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రంగారావు ఆదేశించారు. గురువారం ఆయన ఛాంబర్‌లో సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరచుగా హోటళ్లు, రెస్టారెంట్లు తనిఖీ చేసి రిజిస్టరు ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు వచ్చినపుడు తప్పని సరిగా సంతకాలు తీసుకోవాలన్నారు. రెస్టారెంట్లలో పనిచేసే సిబ్బందికి హెల్త్ సర్టిఫికెట్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. బార్లు, రెస్టారెంట్లకు కూడా ఇది వర్తిస్తుందన్నారు. అన్ని వ్యాపార దుకాణాలకు ట్రేడ్ లైసెన్సు తప్పని సరిగా ఉండాలని ఆదేశించారు. అన్ని వార్డుల్లో మెప్మా సిబ్బంది, ఆర్పీల ద్వారా తడి పొడి చెత్త వేరుచేసి పారిశుధ్య సిబ్బందికి అందించేలా అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ నిర్మూలనలో భాగంగా అన్ని వ్యాపార సముదాయాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి ప్లాస్టిక్ రహిత పట్టణంగా చేయాలన్నారు.


సచివాలయ కార్యదర్శులతో మాట్లాడుతున్న కమిషనర్ రంగారావు

స్వచ్ఛ పట్టణానికి సహకరించాలి

మండపేట, న్యూస్‌టుడే: పట్టణ పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి కోరారు. గురువారం ఏడిద రోడ్డులో కాలువ గట్లపై పేరుకు పోయిన వ్యర్థాల తొలగింపు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఆమె వెంట డీఈ శ్రీనివాస్, ఏఈ పవన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్తిరాజు ఉన్నారు.

కపిలేశ్వరపురంలో అన్నసమారాధన

అంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం దేవీ సెంటర్‌లో శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. గ్రామానికి చెందిన పీఎంపీ వైద్యుడు కూళ్ల శ్రీనివాస్ దంపతుల ఆర్థిక సహకారంతో సుమారు 5,000 మందికి అన్నదానం చేశారు.

కళాశాలల వద్ద గస్తీ.. యువకులకు కౌన్సెలింగ్


విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ అశోక్ కుమార్

రామచంద్రపురం, న్యూస్‌టుడే: కళాశాలల వద్ద ఆకతాయిల హడావిడి, ఈవ్ టీజింగ్, ఒకే వాహనంపై ముగ్గురు యువత వెళ్తున్న సంఘటలను అరికట్టేందుకు రామచంద్రపురం పోలీసులు ఆయా కళాశాలల వద్ద గురువారం పహారా కాశారు. కొంతమంది యువతను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్ వద్ద సీఐ కడియాల అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చారు. పోలీసు ఉన్నతాధికారులు ఎస్పీ, డీఎస్పీల ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో పలు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సీఐతోపాటు కె.గంగవరం, ద్రాక్షారామ ఎస్సైలు జానిభాష, లక్ష్మణ్, రామచంద్రపురం ఏఎస్ఐ ఆచారి, పోలీసు సిబ్బందితో ఆయా యువకులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ అశోక్‌కుమార్ మాట్లాడుతూ యువకుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. సరైన పత్రాలు లేని వాహనాలపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. యువత కారణంగానే పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. కళాశాలలు ముగిసిన వెంటనే ఎవరి ఇళ్లకు వాళ్లు వెళ్లిపోవాలని అలా కాని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి దారేదీ..!

స్థానిక విజయమహాల్ ఎదురుగా ఉన్న సన్నటి ఇరుకు సందులో గల అద్దె భవనం మొదటి అంతస్తులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. వర్షం కురిసిందంటే చిత్తడిగా మారుతోంది. కనీసం కాలువ వ్యవస్థ లేకపోవడం వల్ల వర్షం నీరు అక్కడ ఇంకిపోవాల్సిందే. నడిచేందుకు దారి కూడా లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ సందు ప్రయివేటు వ్యక్తులది కావడం వల్ల తాము ఏమీ చేయలేమని అధికారులు అంటున్నారు.

–న్యూస్‌టుడే, మండపేట



రేవులు ఇలా.. కార్తిక స్నానాలు ఎలా..!

మండపేట: నవంబరు 2వ తేదీ నుంచి కార్తిక మాసం ప్రారంభమవుతుంది. మండపేట నియోజకవర్గం పరిధిలో ఉన్న పలు స్నానాల రేవుల్లో కనీస సౌకర్యాలు లేవు. మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లో గ్రామాల్లో స్నానాల రేవులు, పావంచరేవుల వద్ద అధ్వాన పరిస్థితులు ఉన్నాయి. ✦ మండపేట పట్టణంలో ముఖ్యంగా పెదకాలువ వద్దగల ఏకాదశరుద్రులు ఆలయం వద్ద స్నానఘట్టం వద్ద రక్షణ గొట్టాలు విరిగిపోయాయి. మెట్ల వద్ద వ్యర్థాలు పేరుకుపోయి నాచు పట్టి కాలు పెడితే జారిపోతున్నాయి. ఇక్కడ ప్రమాద హెచ్చరిక ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం పంటకాలువలో నీటి ప్రవాహం అధికంగా ఉన్నందున తగిన చర్యలు చేపట్టాలి. ✦ వీరభద్రపురం వద్ద స్నానాలరేవు, మెహర్ ఆశ్రమం వద్ద, మారేడుబాక వంతెన వద్ద నిడసనమెట్ట కాలువ స్నానాల రేవుల వద్ద రక్షణ లేక ప్రమాదకరంగా మారాయి. ✦ అర్తమూరు పంటకాలువలో వినాయకుడి ఆలయం వద్ద గుర్రపుడెక్క పెరిగిపోయి అపరిశుభ్రంగా మారింది. ✦ ద్వారపూడి అయ్యప్ప స్వామి ఆలయం వద్ద కాకినాడ కాలువలో ప్రస్తుతం నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నందున ఇక్కడ రక్షణ చర్యలు తీసుకోవాలి. ఇదే కాలువపై జెడ్‌మేడపాడు వంతెన వద్ద పరిస్థితులు ప్రమాదకరంగా ఉన్నాయి. ✦ వెలగతోడు, పాలతోడు గ్రామాల పరిధిలో పంటకాలువల వద్ద రక్షణ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. ✦ కపిలేశ్వరపురం మండలంలో గోదావరి నదీ వద్ద తాతపూడి, కపిలేశ్వరపురం, కోరుమిల్లి రేవుల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ✦ రాయవరం మండలంలో ప్రధానంగా చల్లూరు లోని కోరంగి కాలువ రేవు సమీపంలో గుర్రపు డెక్కటి ప్రవాహానికి స్నానాలకు ఆటంకంగా ఉంది. ✦ సోమేశ్వరం పరిధిలో మాచవరం వంతెన వద్ద స్నానాల రేవు, రాయవరం, వి.సావరం వెదురుపాక గ్రామాలకు తుల్యభాగ కాలువలో కాలుష్యం కారణంగా స్నానాలకు అనువుగా లేవు. తుల్యభాగ నది శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు. మండపేట పట్టణం పరిధిలో స్నానాల రేవుల వద్ద శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ రంగారావు తెలిపారు.


పెదకాలువ వద్ద నాచు పట్టిన మెట్లు రక్షణగా ఇనుప గొట్టాలు లేక ప్రమాదకరంగా


మారేడుబాక వంతెన వద్ద ప్రమాదకరంగా...

భూ సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండపేట మండలం పాలతోడు పంచాయతీ కార్యాలయంలో రీసర్వే భూ సమస్యల పరిష్కార వేదికలో భాగంగా గురువారం గ్రామసభ నిర్వహించారు. భూముల రీసర్వే వల్ల నష్టపోయిన రైతుల నుంచి 37 వినతులు స్వీకరించారు. సర్పంచి పిల్లా వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కిర్లంపల్లి ప్రసాద్, ఆర్ఐ పి.వాసంతి, సర్వేయర్లు సుజాత, పి.నాగప్రవీణ్‌కుమార్, వీఆర్వో ఇ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పాలతోడులో పాల్గొన్న రెవెన్యూ అధికారులు

అంగర: రీ సర్వే భూ సమస్యల పరిష్కారం కోసం ప్రతి గ్రామంలోనూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పి.చిన్నారావు అన్నారు. గురువారం కపిలేశ్వరపురం మండలం నిడసనమెట్టలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో ఆయన పాల్గొని, రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో జట్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.